# అధ్యాయం I     రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక స్థితిగతులు

## ఆంధ్రప్రదేశ్ స్వరూప చిత్రణ

ఆంధ్రప్రదేశ్ 2.75 లక్షల చ.కి.మీ. వైశాల్యంతో భౌగోళికంగా దేశంలో నాల్గవ అతి పెద్ద రాష్ట్రంగా ఉంది. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్ర జనాభా 8.47 కోట్లు. రాష్ట్రం గత దశాబ్ద కాలంలో స్వల్పంగా ఆర్థికాభివృద్ధి సాధిస్తోంది. రాష్ట్ర స్థూల గృహోత్పత్తి (జి.ఎస్.డి.పి.) 2001-02 నుంచి 2010-11 మధ్యలో 15.36 శాతం వార్షిక కాంపౌండ్ వృద్ధి రేటున పెరుగుతోంది. సాధారణ వర్గం రాష్ట్రాలలో[1] ఇది 14.68 శాతం ఉంది. ఇదే సమయంలో జనాభా 11.10 శాతం పెరిగింది. సాధారణ వర్గం రాష్ట్రాలలో ఈ రేటు 17.56 శాతం ఉంది. పర్యవసానంగా, ఈ దశాబ్దంలో తలసరి ఆదాయం కాంపౌండ్ వార్షిక వృద్ధి రేటు ఆంధ్రప్రదేశ్‌లో (12.55 శాతం) సాధారణ వర్గం రాష్ట్రాల (11.32 శాతం) కన్నా ఎక్కువగా ఉంది.

దారిద్ర్యరేఖకు దిగువ జన సంఖ్య (15.8 శాతం), శిశు మరణాల రేటు (వెయ్యి సజీవ జననాలకు 49), జీవన పరిమాణం (64.4 సంవత్సరాలు) వంటి కీలకమైన సామాజిక - ఆర్థిక పరామితులు అఖిల భారత రేటుకన్నా మెరుగ్గా ఉన్నాయి. గిని[2] కో-ఎఫిషియెంట్‌లో ప్రతిబింబించిన విధంగా ఆదాయ పంపిణీలో అసమానత కూడా జాతీయ సగటుకన్నా రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలలో (0.29) కొంచెం తక్కువగా ఉంది. కానీ, ఇది పట్టణ ప్రాంతాలలో (0.37) జాతీయ సగటుకు ఇంచుమించు సమానంగా ఉంది (***అనుబంధం 1.1***).

## 1.1 పరిచయం

ఈ అధ్యాయంలో, ప్రస్తుత సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆర్థిక స్థితిగతుల సమగ్ర స్వరూపంతోపాటు, గత ఐదేళ్ళలోని సమగ్ర ధోరణుల నేపథ్యంలో గత ఏడాదితో పోలిస్తే ప్రధాన ద్రవ్య మొత్తాల్లోని కీలక మార్పులపై విశ్లేషణలున్నాయి. ఆర్థిక పద్దులు, ఇంకా రాష్ట్ర ప్రభుత్వం నుంచి తీసుకున్న సమాచారం ఆధారంగా ఈ విశ్లేషణ చేయటం జరిగింది. ప్రభుత్వ పద్దుల నిర్మాణం, ఆర్థిక పద్దుల స్వరూపం ***అనుబంధం 1.2*** లో ఉన్నాయి.

## 1.2 ప్రస్తుత సంవత్సరపు ద్రవ్య లావాదేవీల సంక్షిప్త వివరణ

గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది (2010-11) లో రాష్ట్ర ప్రభుత్వ ద్రవ్య లావాదేవీల సంక్షిప్త వివరాలను **పట్టిక 1.1** లోనూ, ప్రస్తుత సంవత్సరపు రాబడులు, చెల్లింపులు, సమగ్ర ద్రవ్య స్థితిని ***అనుబంధం 1.3*** లోనూ ఇవ్వడం జరిగింది.

---

[1] ప్రత్యేక వర్గం రాష్ట్రాలుగా పేర్కొన్న 11 రాష్ట్రాలు (అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, జమ్ము - కాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, మణిపూర్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, సిక్కిం, త్రిపుర, ఉత్తరాఖండ్) కాకుండా, మిగతా రాష్ట్రాలు

[2] ఇది ఆర్థిక అసమానతలకు కొలమానం. సున్నా పరిపూర్ణ సమానతనూ, ఒకటి అసమానతనూ సూచిస్తాయి

## పట్టిక 1.1 ద్రవ్య లావాదేవీల సంక్షిప్త వివరాలు

(₹ కోట్లలో)

| రాబడులు | | | చెల్లింపులు | | | | |
|---|---|---|---|---|---|---|---|
| విభాగం - ఎ | 2009-10 | 2010-11 | విభాగం - ఎ | 2009-10 | 2010-11 | | |
| | మొత్తం | మొత్తం | | మొత్తం | ప్రణాళికేతర | ప్రణాళిక | మొత్తం |
| రెవెన్యూ రాబడులు | 64,678 | 80,996 | రెవెన్యూ వ్యయం | 63,448 | 58,833 | 19,701 | 78,534 |
| *పన్నుల నుంచి రాబడి* | *35,176* | *45,139* | *సాధారణ సేవలు* | *21,392* | *26,577* | *131* | *26,708* |
| *పన్నులు కాని రాబడి* | *7,803* | *10,720* | *సాంఘిక సేవలు* | *25,757* | *18,042* | *14,272* | *32,314* |
| *కేంద్ర పన్నులు/సుంకాలలో వాటా* | *12,141* | *15,237* | *ఆర్థిక సేవలు* | *16,213* | *14,048* | *5,298* | *19,346* |
| *కేంద్రప్రభుత్వం నుంచి గ్రాంటులు* | *9,558* | *9,900* | *సహాయక గ్రాంటులు, విరాళాలు* | *86* | *166* | *---* | *166* |
| విభాగం - బి | | | విభాగం - బి | | | | |
| వివిధ క్యాపిటల్ రాబడులు | --- | --- | క్యాపిటల్ పరివ్యయం | 13,793 | 3 | 11,120 | 11,123 |
| లోన్లు, అడ్వాన్సుల వసూళ్ళు | 143 | 173 | ఇచ్చిన లోన్లు, అడ్వాన్సులు | 1,590 | 102 | 3,213 | 3,315 |
| ప్రజా ఋణాల రాబడి[3] | 19,753 | 18,722 | ప్రజా ఋణం తిరిగి చెల్లింపు | 6,277 | --- | --- | 7,881 |
| ఆకస్మిక ఖర్చుల నిధి | 7 | --- | ఆకస్మిక ఖర్చుల నిధి | --- | --- | --- | 2 |
| ప్రజా పద్దులోకి రాబడి | 71,780 | 76,218 | ప్రజా పద్దు నుండి చెల్లింపులు | 70,243 | --- | --- | 72,407 |
| *నగదు ప్రారంభ నిల్వ* | *4,973* | *5,983* | *నగదు ముగింపు నిల్వ* | *5,983* | *---* | *---* | *8,830* |
| మొత్తం | 1,61,334 | 1,82,092 | మొత్తం | 1,61,334 | --- | --- | 1,82,092 |

నిరుటితో పోలిస్తే రాష్ట్ర ఆర్థిక స్థితిలో 2010-11 లో వచ్చిన గణనీయమైన మార్పులు ఇలా ఉన్నాయి :

| | |
|---|---|
| రెవెన్యూ రాబడులు | - 25.23 శాతం పెరిగాయి<br>- సొంత పన్నుల ఆదాయం 28.32 శాతం పెరిగింది |
| రెవెన్యూ వ్యయం | - 23.78 శాతం పెరిగింది<br>- ప్రణాళికా వ్యయం 27.58 శాతం పెరిగింది<br>- ప్రణాళికేతర వ్యయం 22.55 శాతం పెరిగింది |
| క్యాపిటల్ వ్యయం | - 19.30 శాతం తగ్గింది |
| లోన్లు, అడ్వాన్సులు | - వసూళ్ళు 20.97 శాతం పెరిగాయి<br>- చెల్లింపులు 108.49 శాతం పెరిగాయి |
| ప్రజా ఋణం | - రాబడి 5.22 శాతం తగ్గింది<br>- తిరిగి చెల్లింపులు 25.55 శాతం పెరిగింది |
| నగదు నిల్వ | - 47.58 శాతం పెరిగింది |

*రాష్ట్ర ప్రభుత్వం వరుసగా ఐదో సంవత్సరం రెవెన్యూ మిగులును సాధించింది. 2009-10 లో ద్రవ్య లోటు జి.ఎస్.డి.పి. లో 2.95 శాతం ఉండగా ప్రస్తుత సంవత్సరం 2.08 శాతం (₹ 11,803 కోట్లు) ఉంది. ఎఫ్.ఆర్.బి.ఎమ్. చట్టం, 13 వ ఆర్థిక సంఘం నిర్ణయించిన 3.0 శాతం పరిమితికి లోబడే ఇది ఉంది.*

[3] వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సులు, ఓవర్‌డ్రాఫ్టుల రూపేణా జరిగిన నికర లావాదేవీలను మినహాయించి

## 1.3 బడ్జెట్ అంచనాలు, వాస్తవ విలువలు

కీలకమైన ద్రవ్యపరామితులకు సంబంధించి బడ్జెట్ అంచనాలు, వాస్తవ విలువలను **చార్టు 1.1** లోనూ, ***అనుబంధం 1.4*** లోనూ ఇవ్వడమైంది.

**చార్టు 1.1 : బడ్జెట్ అంచనాలు, వాస్తవ విలువలు**




పలు పరామితుల విషయంలో వాటి బడ్జెట్ అంచనాలకు, వాస్తవ విలువలకు మధ్య గణనీయమైన వ్యత్యాసాలు ఉన్నాయి. రెవెన్యూ వసూళ్ళు 10.65 శాతం మేర, రెవెన్యూ వ్యయం 9.83 శాతం మేర తగ్గాయి. ఫలితంగా రెవెన్యూ మిగులు బడ్జెట్ అంచనాల కంటే 30.61 శాతం తగ్గింది.

రెవెన్యూ రాబడులు ప్రధానంగా భూమి - సంపద విక్రయంలో (99.48 శాతం), కేంద్ర అమ్మకం పన్నులలో (23.29 శాతం), రాష్ట్ర అమ్మకం పన్నులలో (7.52 శాతం) బడ్జెట్ అంచనాల కంటే తక్కువ వచ్చాయి. ఇక రెవెన్యూ వ్యయం విషయానికి వస్తే, సాగునీరు, వరదల నియంత్రణ (40.39 శాతం), విద్యుత్తు (18.94 శాతం సబ్సిడీ విడుదల చేయలేదు), పట్టణాభివృద్ధి (21.66 శాతం), సాంఘిక సంక్షేమం - పోషకాహారం (8.61 శాతం), వడ్డీ చెల్లింపులు (5.11 శాతం) అంశాలపై మొత్తం మీద రాష్ట్ర ప్రభుత్వం 9.83 శాతం మేర ఖర్చు చేయలేకపోయింది. ఇంతే కాక, ద్రవ్య లోటు, ప్రాథమిక లోటు కూడా బడ్జెట్ అంచనాల కంటే 9.09 శాతం, 23.62 శాతం మేరకు తగ్గాయి.

## 1.4 ద్రవ్య సంస్కరణ పథం

పన్నెండవ ఆర్థిక సంఘం (టి.ఎఫ్.సి.) సిఫార్సుల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ద్రవ్య బాధ్యత, బడ్జెట్ నిర్వహణ (ఎఫ్.ఆర్.బి.ఎమ్.) చట్టం - 2005 అనే చట్టాన్ని చేసింది. ఈ చట్టానికి 2011 లో సవరణ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తన మొత్తం బకాయిలను 2010-11 సంవత్సరంలో జి.ఎస్.డి.పి. లో 30.3 శాతానికీ, 2014-15 సంవత్సరం జి.ఎస్.డి.పి. లో 27.6 శాతానికీ పరిమితం చేసుకుంది. సవరించిన ఎఫ్.ఆర్.బి.ఎమ్. చట్టం - 2005 సారాంశం ***అనుబంధం 1.5*** లో ఇవ్వడం జరిగింది. పదమూడవ ఆర్థిక సంఘం కాలవ్యవధికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ద్రవ్య దిద్దుబాటు పథం ఫలితాల సూచికలను రూపొందించలేదు. కేంద్రీయ గణాంక కార్యాలయం, కొత్త ఢిల్లీ ప్రవేశపెట్టిన జాతీయ గణక గణాంకాల తాజా పరంపర మేరకు రాష్ట్ర స్థూల గృహోత్పత్తి (జి.ఎస్.డి.పి.) లెక్కింపుకు ప్రాతిపదిక సంవత్సరాన్ని 1999-2000 నుంచి 2004-05 కు మార్చటం జరిగింది. వర్తమాన ధరల వద్ద జి.ఎస్.డి.పి. లెక్కింపు, దాని మీద వ్యాఖ్యలను తదనుగుణంగా 2006-11 మధ్య ఐదు సంవత్సరాలకు సవరించడం జరిగింది.

## 1.5 రాష్ట్ర వనరులు

### *1.5.1 వార్షిక ఆర్థిక పద్దుల ప్రకారం రాష్ట్ర వనరులు*

రాష్ట్ర ప్రభుత్వానికి రెవెన్యూ, క్యాపిటల్ అనే రెండు రకాల రాబడుల ద్వారా వనరులు సమకూరుతాయి. రెవెన్యూ రాబడులలో పన్నుల వసూళ్ళు, పన్నులు కాని రాబడులు, కేంద్ర పన్నులు - సుంకాల్లో రాష్ట్ర వాటా, భారత ప్రభుత్వం ఇచ్చే సహాయక గ్రాంట్లు ఉంటాయి. క్యాపిటల్ రాబడుల్లో పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా వచ్చే మొత్తాలు, లోన్లు, అడ్వాన్సుల రికవరీలు, అంతర్గత అప్పుల ద్వారా పొందిన మొత్తాలు (మార్కెట్ లోన్లు, ఆర్థిక సంస్థలు, వాణిజ్య బ్యాంకుల నుండి అప్పులు), భారత ప్రభుత్వం ఇచ్చిన లోన్లు, అడ్వాన్సులు, ప్రజా పద్దులోకి వచ్చే మొత్తాలు వంటి వివిధ రకాల క్యాపిటల్ స్వభావం కలిగిన రాబడులు ఉంటాయి.

చార్టు 1.2 : రాబడుల ధోరణి




ప్రస్తుత సంవత్సరానికి సంబంధించి వార్షిక ఆర్థిక పద్దులలో నమోదైన రాష్ట్ర రాబడులు, చెల్లింపులను **పట్టిక 1.1** లో చూపడమైంది. 2010-11 సంవత్సరానికి రాష్ట్ర రాబడులలోని వివిధ అంశాల సరళిని **చార్టు 1.2** తెలియజేస్తుంది. ఈ ఏడాది రాష్ట్ర వనరుల సమ కూర్పును **చార్టు 1.3** లో చూడవచ్చును. **చార్టు 1.2** లో చూపినట్లు రాష్ట్ర ప్రభుత్వపు మొత్తం రాబడులు 2006-07 లో ₹ 1,02,216 కోట్లు కాగా, అవి 2010-11 లో ₹ 1,76,109 కోట్లకు పెరిగాయి.

2006-11 మధ్య కాలంలో మొత్తం రాబడుల్లో రెవెన్యూ రాబడుల వాటా 41 నుండి 46 శాతం మధ్య ఉంది. గత ఐదేళ్ళలోనూ క్యాపిటల్ వసూళ్ళ వాటా హెచ్చు తగ్గులవుతూ, ఈ ఏడాది అది 11 శాతంగా ఉంది. గత ఐదేళ్ళలో ప్రజా పద్దు కింద వచ్చిన రాబడులు మొత్తం రాబడులలో 43 నుండి 50 శాతం మధ్య ఉన్నాయి.

చార్టు 1.3 : 2010-11 లో రాబడుల కూర్పు (₹కోట్లలో)




## 1.6 రెవెన్యూ రాబడులు

ఆర్థిక పద్దులలోని 11 వ పట్టికలో రాష్ట్ర ప్రభుత్వ రెవెన్యూ రాబడుల వివరాలుంటాయి. రెవెన్యూ రాబడులలో రాష్ట్ర ప్రభుత్వపు సొంత పన్నుల వసూళ్ళు, పన్నులు కాని రాబడులు, కేంద్ర పన్నులలోని రాష్ట్ర వాటా, భారత ప్రభుత్వం నుండి వచ్చిన సహాయక గ్రాంట్లు ఉంటాయి. 2006-11 మధ్య కాలంలో రాష్ట్ర రెవెన్యూ రాబడుల సరళి, కూర్పులను ***అనుబంధం 1.6*** లో ఇవ్వడమైంది. వీటిని **చార్టులు 1.4, 1.5** లలో కూడా చూపడం జరిగింది.

చార్టు 1.4 : రెవెన్యూ రాబడుల సరళి




చార్టు 1.5 : రెవెన్యూ రాబడుల కూర్పు




2006-11 మధ్య గల ఐదేళ్ళ కాలంలో రెవెన్యూ రాబడులు 18.71 శాతం సగటు వృద్ధి రేటుతో క్రమంగా పెరిగాయి. సగటు వృద్ధి రేటు కంటే ఈ సంవత్సరం వృద్ధి రేటు (25.23 శాతం) ఎక్కువగా ఉన్నప్పటికీ, ఈ సంవత్సరపు రెవెన్యూ రాబడులు (₹ 80,996 కోట్లు) స్థూల ఆర్థిక నమూనా ప్రకటన (ఎమ్.ఇ.ఎఫ్.ఎస్.) అంచనాల (₹ 87,432 కోట్లు) కంటే ₹ 6,436 కోట్లు (7.36 శాతం) తక్కువగా ఉన్నాయి. ఈ సంవత్సరం రాష్ట్ర సొంత పన్నులు, పన్నులు కాని రాబడులు (₹ 55,859 కోట్లు) గత సంవత్సరం కంటే ₹ 12,880 కోట్ల మేర పెరిగాయి. ఐతే ఇవి ఎమ్.ఇ.ఎఫ్.ఎస్. అంచనాల కంటే ₹ 2,672 కోట్లు తక్కువగా ఉన్నాయి. 13 వ ఆర్థిక సంఘం, ఇంకా రాష్ట్ర ప్రభుత్వం చేసిన అంచనాలతో పోలుస్తూ 2010-11 లో వాస్తవంగా వచ్చిన పన్నుల రాబడి, పన్నులు కాని రాబడి ఈ దిగువ **పట్టిక 1.2** లో ఇవ్వడమైనది.

**పట్టిక 1.2 : రెవెన్యూ రాబడులు - అంచనాలు**

**(₹ కోట్లలో)**

| | 13 వ ఆర్థిక సంఘం అంచనాలు | ఎమ్.ఇ.ఎఫ్.ఎస్. లో రాష్ట్ర ప్రభుత్వం చేసిన అంచనాలు | వాస్తవం |
|---|---|---|---|
| **పన్నుల రాబడి** | 46,074 | 47,421 | 45,139 |
| **పన్నులు కాని రాబడి** | 6,761 | 11,110 | 10,720 |

(మూలం : 2010-11 సంవత్సరపు రాష్ట్ర ఆర్థిక పద్దులు, ఎఫ్.ఆర్.బి.ఎమ్. చట్టం ప్రకారం 2010-11 లో శాసన సభ ముందుంచిన స్టేట్‌మెంటు మరియు 13 వ ఆర్థిక సంఘం సిఫార్సులు)

రెవెన్యూ రాబడులు, సొంత పన్నుల వృద్ధి రేటు 2009-10 సంవత్సరంలో తప్ప గత ఐదేళ్ళకు గాను నాలుగు సంవత్సరాలలో పెరిగింది. ఈ రెండు అంశాలలోనూ ప్రస్తుత సంవత్సరం నిరుటి మీద గణనీయమైన వృద్ధి కనిపించింది.

రాష్ట్ర స్థూల గృహోత్పత్తి (జి.ఎస్.డి.పి.) తో సాపేక్షికంగా రెవెన్యూ రాబడుల సరళిని ఈ దిగువ **పట్టిక 1.3** లో చూపడమైంది.

పట్టిక 1.3 : జి.ఎస్.డి.పి. తో సాపేక్షికంగా రెవెన్యూ రాబడుల సరళి

| | 2006-07 | 2007-08 | 2008-09 | 2009-10 | 2010-11 |
|---|---|---|---|---|---|
| రెవెన్యూ రాబడులు (₹ కోట్లలో) | 44,245 | 54,143 | 62,858 | 64,678 | 80,996 |
| రెవెన్యూ రాబడుల వృద్ధి రేటు[4] (శాతం) | 26.95 | 22.37 | 16.10 | 2.90 | 25.23 |
| రెవెన్యూ రాబడులు/జి.ఎస్.డి.పి. (శాతం)[5] | 14.70 | 14.84 | 15.12 | 13.61 | 14.27 |
| చలన గుణం నిష్పత్తులు[6] | | | | | |
| జి.ఎస్.డి.పి. తో పోలిస్తే రెవెన్యూ చలన గుణం | 1.53 | 1.06 | 1.15 | 0.20 | 1.30 |
| జి.ఎస్.డి.పి. తో పోలిస్తే రాష్ట్ర సొంత పన్నుల చలన గుణం | 1.39 | 0.96 | 1.13 | 0.38 | 1.46 |

### *1.6.1 రాష్ట్ర సొంత వనరులు*

కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటా, సహాయక గ్రాంట్లను ఆర్థిక సంఘం సిఫార్సులు, కేంద్ర పన్నుల వసూళ్ళు, ప్రణాళికా పథకాలకు కేంద్రం ఇచ్చే సాయం మొదలైన వాటి ఆధారంగా నిర్ణయిస్తారు కనుక అదనపు వనరుల సమీకరణలో రాష్ట్రం పని తీరును, రాష్ట్రం సొంత వనరులను అంటే సొంత పన్నుల వసూళ్ళు, పన్నులు కాని ఇతర రాబడులను దృష్టిలో ఉంచుకుని అంచనా వేయాల్సి ఉంటుంది.

#### *1.6.1.1 సొంత పన్నుల నుండి రాబడి*

సొంత పన్నుల నుండి రాబడి (ఒ.టి.ఆర్.) వృద్ధి రేటు గత సంవత్సరం మీద ఈ సంవత్సరం 28.32 శాతానికి పెరిగింది. ఈ ఏడాది పన్నుల ద్వారా రాష్ట్రానికి వచ్చిన ఆదాయంలో అమ్మకపు పన్నుదే (65 శాతం) సింహభాగం. ఎ.పి. వ్యాట్ చట్టం 2005 లోని షెడ్యూలు - V కింద ప్రామాణిక రేటున పన్ను విధించే వస్తువులపై పన్ను రేటును 12.5 శాతం నుంచి 14.5 శాతానికి సవరించడం, వైమానిక ఇంధనం మీద పన్నును 4 శాతం నుంచి 16 శాతంకు సవరించడం ఇందుకు కారణం. ఆస్తుల మార్కెట్ విలువలు సవరించడం, 1200 చ.అ. కన్నా తక్కువ విస్తీర్ణం గల ప్లాట్లకు స్టాంపు సుంకం మినహాయింపును ఉపసంహరించుకోవటం వలన స్టాంపు సుంకం, రిజిస్ట్రేషన్ రుసుముల పరంగా రాబడి పెరిగింది (45.28 శాతం). వాహన రంగంలో అభివృద్ధి వలనా, నిర్మాణ సామగ్రి వాహనాలను జీవిత కాల పన్ను పరిధిలో చేర్చటం, ఇంకా నాలుగు చక్రాల వాహనాలపై జీవిత పన్ను పెంచడం వలన ఆదాయం పెరిగి (31.63 శాతం) రాష్ట్ర సొంత పన్నుల రాబడి ఇనుమడించింది. ఐదేళ్ళ కాలంలో రాష్ట్ర సొంత పన్నుల ఆదాయంలో అబ్కారీ పన్నుల వాటా పెరుగుతూ విదేశీ మద్యం, సారాయి మీద పన్నులు పెంచడంతో ఈ సంవత్సరం అది 18 శాతానికి చేరింది.

#### *1.6.1.2 పన్నులు కాని రాబడులు*

గత ఐదేళ్ళలో (2006-11) పన్నులు కాని ఇతర రాబడులు మొత్తం రెవెన్యూ రాబడులలో 12 నుంచి 15 శాతం మధ్య ఉన్నాయి. గత ఏడాది కంటే ఈ ఏడాది ఇవి ₹ 2,917 కోట్ల మేర పెరిగాయి. భారత ప్రభుత్వం 2009-10 సంవత్సరానికి

[4] పేజీ 85 లోని పారిభాషిక పదకోశం చూడండి

[5] ప్రాతిపదిక సంవత్సరంగా 2004-05 ను తీసుకోవటం వలన ఆర్థిక, గణాంక శాఖ తెలియజేసిన జి.ఎస్.డి.పి. వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ జి.ఎస్.డి.పి. ని ప్రస్తుత ధరల వద్ద 2006-07 నుంచి 2010-11 మధ్య అన్ని సంవత్సరాలకూ సవరించిన వైనం ***అనుబంధం 1.6*** లో చూడవచ్చు

[6] పేజీ 85 లోని పారిభాషిక పదకోశం చూడండి

సంబంధించిన ఋణాల మాఫీ మొత్తం ₹ 703 కోట్లు ఈ సంవత్సరం విడుదల చేయటం, వడ్డీల రూపేణా వచ్చిన రాబడులు ₹ 922 కోట్లు, ఇంకా ఇనుము కాని ఇతర గనులు, లోహ పరిశ్రమల ద్వారా రాబడులు (₹ 178 కోట్లు) ఈ పెరుగుదలకు ప్రధాన కారణాలు. ఈ సంవత్సరపు వడ్డీ వసూళ్ళలో సాగునీటి ప్రాజెక్టుల నుంచి పద్దుల్లో సర్దుబాటు చేసిన ₹ 5,379 కోట్లు ఉన్నాయి. గత సంవత్సరం ఇలా సర్దుబాటు చేసినవి ₹ 4,529 కోట్లు. పన్నులు కాని రాబడి ఈ సంవత్సరం (₹ 10,720 కోట్లు) బడ్జెట్ అంచనాలు (₹ 15,703 కోట్లు), స్థూల ఆర్థిక నమూనా ప్రకటన (ఎమ్.ఇ.ఎఫ్.ఎస్.) అంచనాలు (₹ 11,110 కోట్లు) కంటే తక్కువ.

### *1.6.2 రెవెన్యూ బకాయిలు*

సంబంధిత శాఖలు ఇచ్చిన సమాచారం మేరకు కొన్ని ప్రధాన రాబడుల పద్దుల కింద 31 మార్చి 2011 నాటికి రెవెన్యూ బకాయిలు **చార్టు 1.6** లోనూ, ఐదేళ్ళకు పైబడిన బకాయిలు **చార్టు 1.7** లోనూ విశదీకరించడం జరిగింది.

**చార్టు 1.6 : రెవెన్యూ బకాయిలు**
**2011 మార్చి 31 నాటికి (₹ కోట్లలో)**




**చార్టు 1.7 : ఐదేళ్ళకు పైబడిన రెవెన్యూ బకాయిలు**
**(₹ కోట్లలో)**




రెవెన్యూ బకాయిలు గత సంవత్సరం ₹ 12,154 కోట్లు కాగా అవి ₹ 4,639 కోట్లు మేర పెరిగి ఈ సంవత్సరం ₹ 16,793 కోట్లకు చేరుకున్నాయి. ఇలా 2011 మార్చి 31 నాటికి ఉన్న బకాయిల్లో ఐదేళ్ళకు పైగా ఉన్నవి ₹ 7,710 కోట్లు (46 శాతం). విద్యుత్తుపై పన్నులు, సుంకాల గురించి కొనసాగుతున్న కోర్టు కేసులు (₹ 2,367 కోట్లు), ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ చెల్లించాల్సిన వాహన పన్ను (₹ 2,836 కోట్లు) వలన రెవెన్యూ బకాయిలున్నట్లు చెప్పున్నారు. వాణిజ్య పన్నులు (₹ 10,832 కోట్లు), భూమి శిస్తు (₹ 406 కోట్లు) వంటి మిగతా బకాయిలకు (మొత్తం ₹ 11,590 కోట్లు) నిర్దిష్టమైన కారణాలేవీ చెప్పలేదు.

### *1.6.3 పన్నుల ఎగవేత, రద్దు, వాపసుల వలన రాబడి నష్టం*

వాణిజ్య పన్నుల శాఖ, అటవీ శాఖ, పౌర సరఫరాల శాఖ, రవాణా శాఖ నివేదించిన దాన్ని బట్టి ఈ సంవత్సరం పన్నుల రద్దు వల్ల ₹ 151 కోట్లు, ఎగవేతల వల్ల ₹ 317 కోట్లు, వాపసుల వల్ల ₹ 91 కోట్లు, మొత్తం మీద ₹ 559 కోట్లు రాబడి నష్టం జరిగింది.

### *1.6.4 వసూళ్ళపై వ్యయం*

ప్రధానమైన సొంత పన్నుల వసూళ్ళపై అయిన వ్యయం ఈ దిగువ **పట్టిక 1.4** లో ఇవ్వడం జరిగింది.

**పట్టిక 1.4 : రెవెన్యూ వసూళ్ళపై వ్యయం**

**(₹ కోట్లలో)**

| రెవెన్యూ పద్దు | సంవత్సరం | మొత్తం వసూలు | వసూళ్ళపై వ్యయం | మొత్తం వ్యయంలో ఈ వ్యయం శాతం |
|---|---|---|---|---|
| అమ్మకాలు, వర్తకం, మొదలైన వాటిపై పన్నులు | 2008-09 | 21,852 | 191 | 0.87 |
| | 2009-10 | 23,640 | 216 | 0.91 |
| | 2010-11 | 29,145 | 262 | 0.90 |
| రాష్ట్ర అబ్కారీ | 2008-09 | 5,753 | 184 | 3.19 |
| | 2009-10 | 5,848 | 201 | 3.43 |
| | 2010-11 | 8,265 | 234 | 2.83 |
| వాహనాలపై పన్నులు | 2008-09 | 1,801 | 58 | 3.22 |
| | 2009-10 | 1,995 | 65 | 3.26 |
| | 2010-11 | 2,626 | 85 | 3.24 |
| స్టాంపు సుంకం, రిజిస్ట్రేషన్ రుసుము | 2008-09 | 2,931 | 74 | 2.52 |
| | 2009-10 | 2,639 | 88 | 3.33 |
| | 2010-11 | 3,834 | 95 | 2.48 |

వసూళ్ళపై వ్యయం గత మూడేళ్ళుగా హెచ్చుతగ్గులకు గురవుతోంది. ఐతే 2008-09 సంవత్సరపు జాతీయ గణాంకాలను బట్టి చూడగా వాహనాలపై పన్నులు తప్ప రాష్ట్రంలో పలు పన్నుల వసూళ్ళపై వ్యయం జాతీయ సగటు కన్నా తక్కువగానే ఉంది.

### *1.6.5 కేంద్ర పన్నుల బదిలీ*

గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం కేంద్ర పన్నుల బదిలీలు 25.50 శాతం మేర పెరిగాయి. ఈ పెరుగుదల ప్రధానంగా వ్యవసాయేతర స్థిరాస్తుల మీద పన్నులు (71.23 శాతం), కస్టమ్స్ నికర వసూళ్ళలో వాటా (56.80 శాతం), కేంద్ర సుంకాలు (41.60 శాతం), సర్వీస్ టాక్స్ (18.51 శాతం) లలో ఉన్నది.

### *1.6.6 భారత ప్రభుత్వ గ్రాంట్లు*

భారత ప్రభుత్వ గ్రాంట్లలో ఈ సంవత్సరం నిరుటి మీద 4 శాతం పెరుగుదల (₹ 342 కోట్లు) ఉంది. రాష్ట్రాలకు ఇచ్చే గ్రాంట్లకు తోడు, కేంద్ర ప్రభుత్వం సామాజిక, ఆర్థిక రంగాలలో కీలకమని భావించిన వివిధ పథకాలు, కార్యక్రమాల అమలు కోసం అమలు సంస్థలకు[7] పెద్దమొత్తంలో నిధులను నేరుగా బదిలీ చేస్తోంది. ఈ నిధుల విడుదలలో రాష్ట్ర బడ్జెట్/రాష్ట్ర ట్రెజరీ వ్యవస్థ ప్రమేయం లేకపోవడంతో ఆర్థిక పద్దులలో ఇవి చోటు చేసుకోవు. దీంతో రాష్ట్ర రాబడులను, ఖర్చులను, వాటి నుండి లెక్కించిన ద్రవ్య చరరాశులు/పరామితులను ఆ మేరకు తక్కువగా అంచనా వేయటం జరుగుతోంది. మొత్తం వనరుల

[7] రాష్ట్రంలో కొన్ని నిర్దిష్ట కార్యక్రమాల అమలుకు కేంద్ర ప్రభుత్వం నుండి నిధులు పొందడానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతించిన ఏదైనా సంఘం/సంస్థలను (ప్రభుత్వేతర సంస్థలతో సహా) రాష్ట్ర అమలు సంస్థలంటారు. ఉదా: సర్వ శిక్షా అభియాన్‌కు సంబంధించిన రాష్ట్ర అమలు సమితి, జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్‌కు సంబంధించి రాష్ట్ర ఆరోగ్య మిషన్ మొదలైనవి

లభ్యతపై సమగ్ర స్వరూపాన్ని చూపడం కోసం రాష్ట్ర అమలు సంస్థలకు భారత ప్రభుత్వం నుంచి నేరుగా విడుదలైన నిధుల వివరాలను **అనుబంధం 1.7** లో ఇవ్వడమైంది.

ప్రస్తుత సంవత్సరంలో వివిధ కేంద్ర పథకాలు, కార్యక్రమాల అమలు కోసం భారత ప్రభుత్వం ₹ 12,174 కోట్ల నిధులను రాష్ట్రంలోని అమలు సంస్థలకు రాష్ట్ర బడ్జెట్ ద్వారా కాకుండా నేరుగా విడుదల చేసింది. కార్యక్రమాలను అమలు చేసే సంస్థలకు బడ్జెటేతర మార్గంలో నేరుగా నిధులను అందించడం ద్రవ్య బాధ్యతల చట్టం నిర్దేశించిన పారదర్శకత సూత్రాలకు విరుద్ధం. కాబట్టి జవాబుదారీతనం ఉండదు. ***ఈ నిధుల వినియోగాన్ని ఏ ఒక్క సంస్థా పర్యవేక్షించటం లేదు. అంతే కాకుండా, ఏ ఏడాదిలోనైనా ఏదైనా ఒక ప్రధాన పథకంపై గానీ, ఇతర ముఖ్య పథకాలపై గానీ పెట్టిన ఖర్చుల సమాచారం కూడా అందుబాటులో లేదు. ఈ నిధులను సక్రమంగా లెక్క చెప్పేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం తగు యంత్రాంగం నెలకొల్పాల్సి ఉంది.***

## 1.7 వనరుల వినియోగం

ప్రధానమైన ఖర్చుల బాధ్యతలను రాష్ట్రాలకే అప్పగించడం జరిగింది కాబట్టి, రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో ఖర్చుల కేటాయింపుల విశ్లేషణ ప్రాధాన్యత సంతరించుకుంది. ద్రవ్య బాధ్యతలకు సంబంధించిన చట్టాల పరిధిలో లోటు ద్వారా గానీ, అప్పుల ద్వారా గానీ, ప్రజా అవసరాలపై పెట్టే ఖర్చును పెంచుకోవడానికి బడ్జెట్ పరమైన కొన్ని అవరోధాలున్నాయి. అభివృద్ధి, సామాజిక రంగాలపై చేసే ఖర్చుకు సంబంధించి రాష్ట్ర స్థాయిలో కొనసాగుతున్న ద్రవ్య దిద్దుబాటు, ఏకీకరణ ప్రభావంపై విశ్లేషణను తరువాతి పేరాల్లో చర్చించడమైంది.

రాష్ట్ర స్థాయిలో కొనసాగుతున్న ద్రవ్య దిద్దుబాటు, ఏకీకరణ ప్రభావం తెలుసుకునేందుకు గాను అభివృద్ధి పనులు, ప్రత్యేకించి సామాజిక రంగంలో వ్యయానికి కేటాయింపులను విశ్లేషించడం జరిగింది.

### *1.7.1 ఖర్చుల పెరుగుదల, వాటి కూర్పు*

2006-11 మధ్య గల ఐదేళ్ళ కాలంలో మొత్తం ఖర్చు సరళిని **చార్టు 1.8** తెలియజేస్తుంది. 'ఆర్థిక వర్గీకరణ', 'కార్యకలాపాల వారీగా ఖర్చు'ల దృష్ట్యా మొత్తం వ్యయం కూర్పును **చార్టులు 1.9, 1.10** లలో చూపడం జరిగింది.

**చార్టు 1.8 : మొత్తం వ్యయం సరళి, కూర్పు**




2010-11 లో **మొత్తం వ్యయం** (₹ 92,972 కోట్లు) గత ఏడాది (₹ 78,831 కోట్లు) కంటే ₹ 14,141 కోట్లమేర (18 శాతం) పెరిగింది. క్యాపిటల్ వ్యయంలోని తగ్గుదల (₹ 2,670 కోట్లు) వలన కొంత మేర తగ్గినప్పటికీ లోన్లు, అడ్వాన్సులలోని పెరుగుదల (₹ 1,725 కోట్లు), రెవెన్యూ వ్యయంలోని పెరుగుదల (₹ 15,086 కోట్లు) కారణంగా మొత్తం వ్యయం నికరంగా పెరిగింది. ప్రస్తుత సంవత్సరంలోని మొత్తం ఖర్చుల్లోని 87 శాతం ఖర్చులకు రెవెన్యూ రాబడులనూ, మిగతా ఖర్చులకు ఋణాల ద్వారా సమీకరించుకున్న నిధులను వినియోగించారు. ఐతే మొత్తం వ్యయం బడ్జెట్ లో చూపినదానికన్నా (₹ 1,01,324 కోట్లు) తక్కువగానే ఉన్నది.

**రెవెన్యూ వ్యయం** (₹ 78,534 కోట్లు) నిరుటి కంటే పెరిగినా, ఇది 2010-11 సంవత్సరానికి ఎమ్.ఇ.ఎఫ్.ఎస్. అంచనాల (₹ 86,892 కోట్లు) కంటే ₹ 8,358 కోట్లు (9.62 శాతం) తక్కువగానే ఉంది. రాష్ట్ర ఆర్థిక స్థితిగతుల విషయంలో, ఖర్చుల నాణ్యత ఎప్పుడూ ప్రాధాన్యత సంతరించుకుంటూనే ఉంది. ప్రస్తుతం, రెవెన్యూ వ్యయం రాష్ట్రం మొత్తం వ్యయంలో 84 శాతం దాకా ఉన్నది. ఇది పెట్టుబడులకూ, ఆస్తుల కల్పనకూ కాక వర్తమాన వినియోగ స్వభావం కలిగి ఉండటంతో రాష్ట్రాభివృద్ధి పై ప్రభావం చూపుతుంది.

చార్టు 1.9 : మొత్తం ఖర్చులో అంశాల వారీగా సరళి




రెవెన్యూ ఖర్చుల్లో అభివృద్ధి, సంక్షేమం అవకాశాలు అంతంత మాత్రంగా ఉండి అనావశ్యకమనిపించే అంశాలను గుర్తించవలసి ఉంది.

రెవెన్యూ వ్యయం నిరుటి మీద ₹ 15,086 కోట్లు పెరిగింది. ఇది జి.ఎస్.డి.పి. లో 13.84 శాతం. (i) వడ్డీ చెల్లింపులు, ఋణ సర్వీసింగ్ కింద (₹ 847 కోట్లు); (ii) మాధ్యమిక విద్య కోసం స్థానిక సంస్థలకూ, సాంకేతిక విద్య కోసం విశ్వ విద్యాలయాలకూ ఆర్థిక సాయం పెరగడం వలన విద్య, క్రీడలు, కళలు, సంస్కృతి కింద (₹ 4,094 కోట్లు); (iii) షెడ్యూల్డు కులాలు, వెనుకబడిన కులాల సంక్షేమం కింద విద్య కోసం, వెనుకబడిన కులాల సంక్షేమం కింద ఆర్థికాభివృద్ధికీ చెల్లింపులు చేయటం వలన సామాజిక భద్రత, సంక్షేమం కింద (₹ 1,602 కోట్లు); (iv) భారీ సాగునీటిపై ఖర్చు పెరగటం వలన నీటి పారుదల, వరదల నియంత్రణ కింద (₹ 1,084 కోట్లు) ఈ పెరుగుదల ఉంది. రెవెన్యూ వ్యయంలో ప్రణాళికేతర రెవెన్యూ వ్యయం 2009-10 లో 76 శాతం ఉండగా, 2010-11 లో అది 75 శాతం ఉంది.

**క్యాపిటల్ ఖర్చు** (₹ 11,123 కోట్లు) నిరుటి (₹ 13,793 కోట్లు) కంటే ₹ 2,670 కోట్లు తగ్గింది. ఇది మొత్తం ఖర్చులో 11.96 శాతం ఉంది. భారీ, మధ్య తరహా ప్రాజెక్టులపై (₹ 2,164 కోట్లు), రోడ్లు, వంతెనలపై (₹ 242 కోట్లు) ప్రధానంగా తరుగుదల ఉంది. క్యాపిటల్ ఖర్చు జి.ఎస్.డి.పి. లో 1.96 శాతం గానూ, 2010-11 సంవత్సరానికి స్థూల ఆర్థిక నమూనా ప్రకటన (ఎమ్.ఇ.ఎఫ్.ఎస్.) లోని అంచనాల (₹ 14,432 కోట్లు) కంటే తక్కువగానూ ఉంది.

ఈ సంవత్సరం ఇచ్చిన **ఋణాలు, అడ్వాన్సులు** నిరుటి మీద 108.49 శాతం పెరిగాయి. 2006-11 సంవత్సరాల మధ్య కాలంలో ఋణాలు, అడ్వాన్సులుగా ఇచ్చినది మొత్తం వ్యయంలో 2 నుంచి 4 శాతం మధ్య ఉన్నది.

చార్టు 1.10 : మొత్తం ఖర్చులో కార్యకలాపాల వారీగా సరళి




**అంశాల వారీగా సరళి :** ఈ సంవత్సరం వడ్డీ చెల్లింపులు ₹ 761 కోట్లు పెరగటంతో, మొత్తం వ్యయంలో సాధారణ సేవల వాటా నిరుటి మీద 1.59 శాతం పెరిగింది. మొత్తం వ్యయంలో సాంఘిక సేవల వాటా కూడా 1.93 శాతం పెరిగింది. ఐతే, సాంఘిక సేవలలోనూ, ఆర్థిక సేవలలో కూడా క్యాపిటల్ పద్దు కింద వ్యయం ₹ 30 కోట్లు, ₹ 2,656 కోట్ల మేర పతనమైంది. ఆస్తుల కల్పనపై అంతగా దృష్టి పెట్టకపోవడాన్ని ఇది సూచిస్తోంది.

### *1.7.2 తప్పనిసరి ఖర్చులు*

రెవెన్యూ పద్దు కింద రాష్ట్ర ప్రభుత్వ తప్పనిసరి ఖర్చుల్లో ప్రధానంగా వడ్డీ చెల్లింపులు, జీతాలు/వేతనాలు, పింఛన్లు, సబ్సిడీల ఖర్చులు ఉన్నాయి. ఈ అంశాలపై 2008-11 మధ్య కాలంలో అయిన ఖర్చుల సరళిని **పట్టిక 1.5 చార్టు 1.11** లలో చూపడమైంది.

**పట్టిక 1.5 : తప్పనిసరి ఖర్చులలోని అంశాలు**

**(₹ కోట్లలో)**

| తప్పనిసరి ఖర్చుల్లోని అంశం | 2008-09 | 2009-10 | 2010-11 | | |
|---|---|---|---|---|---|
| | | | బడ్జెట్ అంచనాలు | వాస్తవంగా అయిన ఖర్చు | శాతంలో వ్యత్యాసం |
| జీతాలు*, వేతనాలపై మొత్తం ఖర్చు, ఇందులో | 14,539(23) | 17,721(27) | 26,111(29) | 23,844(29) | (-)8.68 |
| ప్రణాళికేతర పద్దు | 12,883 | 15,706 | 23,281 | 21,128 | (-)9.25 |
| ప్రణాళికా పద్దు** | 1,656 | 2,015 | 2,830 | 2,716 | (-)4.03 |
| వడ్డీ చెల్లింపులు | 8,057 | 8,914 | 10,196 | 9,675 | (-)5.11 |
| పింఛన్లు | 5,518 | 6,339 | 8,428 | 9,609 | 14.01 |
| సబ్సిడీలు | 6,213 | 6,056 | 7,204 | 6,543 | (-)9.18 |
| మొత్తం | 34,327 | 39,030 | 51,939(57) | 49,671(61) | (-)4.37 |

బ్రాకెట్లలోని అంకెలు శాతాన్ని తెలియజేస్తాయి.

* సహాయక గ్రాంట్ల నుండి చెల్లించిన జీతాలు, వర్క్ ఛార్జ్డ్ ఎస్టాబ్లిష్‌మెంట్ కూడా ఇందులో ఉన్నాయి.

** కేంద్ర ప్రాయోజిత పథకాల కింద చెల్లించిన జీతాలు/వేతనాలు కూడా ప్రణాళికా పద్దులలో ఉన్నాయి.

2010-11 లో జీతాలు, వేతనాలు, పింఛన్లు, వడ్డీ చెల్లింపులు, సబ్సిడీలపై తప్పనిసరి ఖర్చులు ప్రణాళికేతర రెవెన్యూ వ్యయంలో 84 శాతం ఉన్నాయి.

### 1.7.2.1 జీతాలు, వేతనాలు

ప్రస్తుత సంవత్సరం జీతాలు, వేతనాలపై ఖర్చు గత సంవత్సరం కంటే 34.55 శాతం పెరిగింది. ఐతే, ఇది బడ్జెట్ అంచనాల కంటే 8.68 శాతం తగ్గింది. వడ్డీ, పింఛను చెల్లింపులను మినహాయించగా *ఈ సంవత్సరపు రెవెన్యూ వ్యయంలో జీతాలపై ఖర్చు 40 శాతం ఉంది.*

**చార్టు 1.11 : 2008-11 మధ్య ప్రణాళికేతర రెవెన్యూ వ్యయంలో తప్పనిసరి ఖర్చు వాటా**




### 1.7.2.2 వడ్డీ చెల్లింపులు

ఈ సంవత్సరం రెవెన్యూ వ్యయంలో వడ్డీ చెల్లింపుల వాటా 12 శాతానికి పడిపోయినప్పటికీ, వడ్డీ చెల్లింపులు గత సంవత్సరం మీద ₹ 761 కోట్లు (9 శాతం) పెరిగాయి. ఐతే, ఇది స్థూల ఆర్థిక నమూనా ప్రకటన (ఎమ్.ఇ.ఎఫ్.ఎస్.) అంచనాల (₹ 10,196 కోట్లు) కంటే తక్కువగానే ఉంది. అంతర్గత ఋణంపై వడ్డీలో పెరుగుదల (₹ 888 కోట్లు), చిన్న మొత్తాల పొదుపు, భవిష్య నిధిలో తగ్గుదల (₹ 111 కోట్లు), భారత ప్రభుత్వం నుంచి లోన్లు, అడ్వాన్సులలో తగ్గుదల (₹ 16 కోట్లు) నికర ప్రభావం వలన ఇది ఏర్పడింది. ఈ సంవత్సరం 8.07 నుంచి 8.57 శాతం వరకూ వడ్డీతో కూడిన మార్కెట్ ఋణాలు (₹ 12,000 కోట్లు) ప్రధాన ఋణ వనరు. వడ్డీ చెల్లింపులు (₹ 9,675 కోట్లు) పదమూడవ ఆర్థిక సంఘం అంచనా (₹ 9,863 కోట్లు) కన్నా తక్కువ.

### 1.7.2.3 పింఛన్లు

గత రెండేళ్ళలో రెవెన్యూ రాబడుల్లో 9-10 శాతంగా ఉన్న పింఛన్ల ఖర్చు ప్రస్తుత సంవత్సరం 12 శాతానికి పెరిగింది. 2010-11 లో పింఛను చెల్లింపులు (₹ 9,609 కోట్లు) గత సంవత్సరపు చెల్లింపుల (₹ 6,339 కోట్లు) కంటే ₹ 3,270 కోట్ల మేర పెరిగాయి (51.58 శాతం). ఇవి బడ్జెట్ అంచనాలు (₹ 8,528 కోట్లు) పదమూడవ ఆర్థిక సంఘం అంచనాల (₹ 7,751 కోట్లు) కంటే ఎక్కువ. దీర్ఘకాలికంగా పెరిగే పింఛను చెల్లింపుల భారాన్ని తగ్గించుకోవడానికి, 2004 సెప్టెంబరు 1 తరువాత నియుక్తులైన ఉద్యోగుల కోసం రాష్ట్ర ప్రభుత్వం కాంట్రిబ్యూటరీ పింఛను పథకాన్ని ప్రవేశపెట్టింది. ఐతే, రాబోయే సంవత్సరాలలో, ప్రతి ఏటా చెల్లించాల్సి ఉన్న పింఛను మొత్తాలను బీమా గణన (యాక్చూరియల్) ప్రాతిపదికన లెక్కగట్టాలని ఎఫ్.ఆర్.బి.ఎమ్. చట్టంలో నిర్దేశించినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం ఇంకా అలా లెక్కించలేదు.

### *1.7.2.4 సబ్సిడీలు*

ప్రస్తుత సంవత్సరంలో మొత్తం సబ్సిడీల వ్యయం ₹ 6,543 కోట్లు. ఇందులో విద్యుత్ సబ్సిడీ ₹ 3,647 కోట్లు (56 శాతం), బియ్యం సబ్సిడీ ₹ 2,250 కోట్లు (34 శాతం), ఇంకా ఇతర సబ్సిడీలు ₹ 646 కోట్లు (10 శాతం) ఉన్నాయి. సబ్సిడీల వ్యయం గత సంవత్సరం కంటే ₹ 487 కోట్లు (8.04 శాతం) పెరిగింది. ఐతే బడ్జెట్ అంచనాల కంటే ₹ 661 కోట్లు (9.18 శాతం) తగ్గింది. ఎమ్.ఇ.ఎఫ్.ఎస్. అంచనాల (₹ 11,456 కోట్లు) కంటే కూడా సబ్సిడీలు 42.89 శాతం మేర తగ్గాయి. విద్యుత్‌పై సబ్సిడీ (₹ 435 కోట్లు), ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ సేద్యం ప్రాజెక్టు (₹ 245 కోట్లు) పెరగగా, బియ్యంపై సబ్సిడీ (₹ 100 కోట్లు), గ్రామీణ/మునిసిపల్ ప్రాంత మహిళలకు ఎల్.పి.జి. కనెక్షన్లు (₹ 57 కోట్లు), డ్వాక్రా గ్రూపులు తీసుకున్న ఋణాలపై వడ్డీ సబ్సిడీ (₹ 39 కోట్లు) తగ్గాయి. అనేక ఇతర రాష్ట్రాల మాదిరి కాకుండా ఆంధ్రప్రదేశ్ ప్రబల ప్రయోజనాలకు స్పష్టమైన సబ్సిడీలనే అందించే పారదర్శక విధానం అనుసరిస్తోంది.

### *1.7.3 స్థానిక సంస్థలు, ఇతర సంస్థలకు ఆర్థిక సాయం*

గత నాలుగేళ్ళతో పోలిస్తే, ఈ ఏడాది స్థానిక సంస్థలు, ఇతర సంస్థలకు గ్రాంట్లు, లోన్ల రూపేణా రాష్ట్ర ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయం వివరాలు **పట్టిక 1.6** లో ఉన్నాయి.

**పట్టిక 1.6 : స్థానిక సంస్థలు మొదలగు వాటికి ఆర్థిక సాయం**

**(₹ కోట్లలో)**

| | 2006-07 | 2007-08 | 2008-09 | 2009-10 | 2010-11 |
|---|---|---|---|---|---|
| విద్యా సంస్థలు (ఎయిడెడ్ పాఠశాలలు, ఎయిడెడ్ కళాశాలలు, విశ్వ విద్యాలయాలు, వగైరా) | 1,767 | 1,876 | 1,820 | 1,994 | 2,876 |
| నగర పాలక, పురపాలక సంస్థలు | 233 | 2,699 | 4,105 | 3,142 | 3,671 |
| జిల్లా పరిషత్తులు, ఇతర పంచాయితీరాజ్ సంస్థలు | 1,310 | 921 | 2,503 | 1,867 | 1,745 |
| అభివృద్ధి సంస్థలు | 1,747 | 3,715 | 11,791 | 7,481 | 8,363 |
| ఆసుపత్రులు, ఇతర ఛారిటబుల్ సంస్థలు | 387 | 600 | 1,152 | 1,393 | 1,721 |
| ఇతర సంస్థలు[8] | 5,322 | 8,851 | 3,436 | 3,965 | 4,538 |
| మొత్తం | 10,766 | 18,662 | 24,807 | 19,842 | 22,914 |
| **రెవెన్యూ ఖర్చులో ఈ ఆర్థిక సాయం శాతం** | **26.00** | **34.53** | **40.11** | **31.27** | **29.18** |

2010-11 లో స్థానిక సంస్థలు, ఇతర సంస్థలకు గ్రాంట్లు, లోన్లతో కలిపి అందించిన ఆర్థిక సాయం (₹ 22,914 కోట్లు) నిరుటి కంటే (₹ 19,842 కోట్లు) ₹ 3,072 కోట్లు (15 శాతం) పెరిగింది. ఇది రెవెన్యూ వ్యయంలో 29.18 శాతం ఉంది. 2010-11 లో స్థానిక సంస్థలు, ఇతర సంస్థల కిచ్చిన ప్రణాళికా గ్రాంట్లు ₹ 12,467 కోట్లు కాగా, ప్రణాళికేతర గ్రాంట్లు ₹ 7,234 కోట్లు. ప్రధానంగా ఈ గ్రాంట్లను - వ్యవసాయ, అనుబంధ సబ్సిడీల రూపంలో ఎ.పి. ట్రాన్స్‌కోకు ₹ 3,647 కోట్లు, వృద్ధులకు, వితంతువులకు ఇచ్చే ఇందిరమ్మ పింఛన్లకు ₹ 1,094 కోట్లు, డ్వాక్రా గ్రూపులు తీసుకున్న ఋణాలపై వడ్డీ సబ్సిడీ (3 శాతం చొప్పున ₹ 565 కోట్లు), జవహర్‌లాల్ నెహ్రూ పట్టణ నవీకరణ పథకం (₹ 544 కోట్లు), ఇంకా రాజీవ్ విద్యా మిషన్ (₹ 537 కోట్లు) ఉన్నాయి. సహాయక గ్రాంట్లలో జీతాల కోసం ఇచ్చినది ₹ 2,810 కోట్లు (12 శాతం) ఉన్నది. ఇతర సంస్థలకు ఇచ్చిన ₹ 4,538 కోట్లలో ₹ 2,300 కోట్లు వికలాంగులకు ఇందిరమ్మ పింఛనులు, వృద్ధాప్య పింఛనులు, పావలా వడ్డీ, డ్వాక్రా గ్రూపులకు బీమా, పింఛనుల చెల్లింపుల కోసం ఇచ్చినది.

[8] ఇతర సంస్థలలో, ఈ సంవత్సరానికి అడ్‌హాక్ లేదా ఒక్కసారి గ్రాంట్లను పొందిన సంస్థలు ఉన్నాయి

## 1.8 ఖర్చుల నాణ్యత

### *1.8.1 ప్రజా వ్యయం చాలుబడి*

రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించిన సాంఘిక రంగ, ఆర్థిక మౌలిక రంగాలకు సంబంధించిన వ్యయబాధ్యతలు ప్రధానంగా రాష్ట్రాలకే చెందిన విషయాలు. మానవ వనరుల వికాసానికి గాను రాష్ట్ర ప్రభుత్వం విద్య, ఆరోగ్యం వంటి కీలక సామాజిక సేవలపై ఖర్చును పెంచుకోవాల్సి ఉంటుంది. ఒక రంగంలో వ్యయం, మొత్తం వ్యయంతో పోల్చినప్పుడు జాతీయ సగటు కన్నా తక్కువగా ఉంటే ఆ రంగంలో ద్రవ్య ప్రాధాన్యత తక్కువ స్థాయిలో ఉన్నట్లు భావించాలి. 2010-11 లో అభివృద్ధి వ్యయం, సాంఘిక వ్యయం, క్యాపిటల్ వ్యయం విషయంలో రాష్ట్ర ప్రభుత్వ ద్రవ్య ప్రాధాన్యత **పట్టిక 1.7** లో విశ్లేషించటం జరిగింది.

**పట్టిక 1.7 : 2007-08 మరియు 2010-11 లలో రాష్ట్రం ద్రవ్య ప్రాధాన్యత**

*(శాతంలో)*

| రాష్ట్రం ద్రవ్య ప్రాధాన్యత* | ఎ.ఇ./ జి.ఎస్.డి.పి. | డి.ఇ.# / ఎ.ఇ. | ఎస్.ఎస్.ఇ./ ఎ.ఇ. | సి.ఇ./ ఎ.ఇ. | విద్య/ ఎ.ఇ. | ఆరోగ్యం/ ఎ.ఇ. |
|---|---|---|---|---|---|---|
| 2007-08 లో సాధారణ వర్గం రాష్ట్ర సగటు (నిష్పత్తి) | 16.85 | 64.28 | 32.54 | 16.14 | 14.64 | 3.98 |
| 2007-08 లో ఆంధ్రప్రదేశ్ సగటు (నిష్పత్తి) | 19.10 | 73.38 | 30.78 | 18.33 | 9.67 | 3.71 |
| 2010-11 లో సాధారణ వర్గం రాష్ట్ర సగటు (నిష్పత్తి) | 16.65 | 64.42 | 36.75 | 13.27 | 17.42 | 4.35 |
| 2010-11 లో ఆంధ్రప్రదేశ్ సగటు (నిష్పత్తి) | 16.38 | 70.87 | 38.15 | 11.96 | 13.54 | 4.60 |

* జి.ఎస్.డి.పి. లో శాతం

ఎ.ఇ. : మొత్తం వ్యయం డి.ఇ. : అభివృద్ధి వ్యయం

ఎస్.ఎస్.ఇ. : సామాజిక రంగంపై వ్యయం సి.ఇ. : క్యాపిటల్ వ్యయం

# అభివృద్ధి వ్యయంలో అభివృద్ధి రెవెన్యూ వ్యయం, అభివృద్ధి క్యాపిటల్ వ్యయం, చెల్లించిన ఋణాలు, అడ్వాన్సులు ఉన్నాయి

**పట్టిక 1.7** లోని సమాచారం ప్రకారం ఆంధ్రప్రదేశ్‌ను సాధారణ వర్గం రాష్ట్రాలతో పోల్చగా ఈ దిగువ విషయాలు తెలిశాయి :

- *2007-08, 2010-11 సంవత్సరాలలో ఆంధ్రప్రదేశ్ మొత్తం వ్యయంలో అభివృద్ధి వ్యయం నిష్పత్తి సాధారణ వర్గం రాష్ట్రాల కంటే ఎక్కువగా ఉన్నది.*
- *2007-08 లో రాష్ట్రం సామాజిక రంగం పై చేసిన ఖర్చు (30.78 శాతం), ప్రత్యేకించి ఆరోగ్యం (3.71 శాతం), విద్య (9.67 శాతం) సాధారణ వర్గం రాష్ట్రాల కన్నా తక్కువగా ఉంది. ఐతే, 2010-11 లో సామాజిక రంగం మీద (38.15 శాతం) విశేషించి ఆరోగ్యం (4.60 శాతం), విద్య (13.54 శాతం) వ్యయం పెరిగి సాధారణ వర్గం రాష్ట్రాల కన్నా 17.42 శాతం తక్కువగా ఉండటంతో తులనాత్మకంగా చాలా అనుకూలంగా ఉంది.*

- *2007-08 లో క్యాపిటల్ వ్యయం నిష్పత్తి సాధారణ వర్గం రాష్ట్రాల కన్నా (16.14 శాతం) ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువగా (18.33 శాతం) ఉంది. ఐతే, ఇది ఈ సంవత్సరం గణనీయంగా తగ్గింది (11.96 శాతం). ఇది సాధారణ వర్గం రాష్ట్రాల (13.27 శాతం) కన్నా కూడా తక్కువగా ఉంది.*
- *తాజా జనాభా లెక్కల (2011) ప్రకారం రాష్ట్రంలో అక్షరాస్యతరేటు 67.66 శాతానికి పెరిగింది. ఇది 2001 జనాభా లెక్కల ప్రకారం 60.47 శాతం ఉండేది.*
- *జీవన పరిమాణం జాతీయ సగటు 63.5 సంవత్సరాలుండగా, 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో అది 64.4 సంవత్సరాలు ఉన్నది. శిశు మరణాల జాతీయ సగటు 1000 సజీవ జననాలకు 50 చొప్పున ఉండగా రాష్ట్రంలో తక్కువగానే (1000 సజీవ జననాలకు 49) ఉంది.*

*విద్య, ఆరోగ్య రంగాలకు అధిక ద్రవ్య ప్రాధాన్యత కల్పించవలసి ఉంది. దీనికి తోడు, పెరుగుతున్న ద్రవ్య బాధ్యతలకు దన్నుగా సంపదలను పెంపొందించుకునేలా క్యాపిటల్ వ్యయం కూడా పెంచాలి.*

### *1.8.2 ఖర్చుల వినియోగంలో సమర్థత*

సామాజిక - ఆర్థికాభివృద్ధి పనులపై ప్రజా వ్యయానికున్న ప్రాధాన్యత దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వాలు తగు వ్యయ హేతుబద్ధీకరణ చర్యలు చేపట్టి, కోర్ పబ్లిక్ గూడ్స్, మెరిట్ గూడ్స్[9] ను సమకూర్చటంలో ప్రత్యేక శ్రద్ధ కనబర్చాల్సిన అవసరముంది. అభివృద్ధి వ్యయం[10] కోసం కేటాయింపులను పెంచడమే కాకుండా, మొత్తం వ్యయం (మరియు/లేదా జి.ఎస్.డి.పి) తో పోలిస్తే క్యాపిటల్ వ్యయం నిష్పత్తి, ప్రస్తుతం ఉన్న సామాజిక, ఆర్థిక సేవల కొనసాగింపు - నిర్వహణలపై చేస్తున్న రెవెన్యూ ఖర్చు వాటాలు కూడా ఖర్చుల సమర్థతను ప్రతిబింబిస్తాయి. మొత్తం ఖర్చు (మరియు/లేదా జి.ఎస్.డి.పి.) తో ఈ అంశాల నిష్పత్తి ఎంత ఎక్కువగా ఉంటే ఖర్చుల నాణ్యత అంత మెరుగ్గా ఉన్నట్లు అర్థం. గత సంవత్సరాలలోనూ, ఈ ఏడాదీ రాష్ట్రం మొత్తం ఖర్చుతో పోలిస్తే అభివృద్ధి వ్యయాల ధోరణులను **చార్టు 1.12** లో చూపడమైంది.

**చార్టు 1.12 : అభివృద్ధి వ్యయం**




మొత్తం అభివృద్ధి వ్యయం నిరుటి కంటే 2010-11 లో ₹ 8,707 కోట్లు పెరిగి (15.23 శాతం) 2006-11 లో మొత్తం వ్యయంలో 69 నుంచి 75 శాతం ఉంది. 2006-11 లో అభివృద్ధి రెవెన్యూ వ్యయం మొత్తం వ్యయంలో 49 నుంచి 57 శాతం వరకూ ఉంది.

---

9 పేజీ 86 లోని పారిభాషిక పదకోశం చూడండి

10 పేజీ 86 లోని పారిభాషిక పదకోశం చూడండి

అభివృద్ధి రెవెన్యూ వ్యయం గత సంవత్సరం కంటే ₹ 9,690 కోట్ల మేర పెరిగి, సాంఘిక సేవలు, ఆర్థిక సేవలలోని అన్ని అంశాలలోనూ పెరుగుదలను నమోదు చేసింది.

ఈ సంవత్సరం అభివృద్ధి క్యాపిటల్ వ్యయం నిరుటి కంటే ₹ 2,687 కోట్లు (20 శాతం) తగ్గగా, అభివృద్ధి లోన్లు, అడ్వాన్సులు ₹ 1,704 కోట్లు (113 శాతం) పెరిగాయి. అభివృద్ధి క్యాపిటల్ వ్యయంలో తగ్గుదల ప్రధానంగా ఆర్థిక సేవల లోనే (₹ 2,656 కోట్లు) ఉంది. ఇది నీటిపారుదల, వరదల నియంత్రణ (₹ 2,165 కోట్లు), రవాణా (₹ 242 కోట్లు) రంగాలలో ఉంది.

మొత్తం వ్యయంలో సాధారణ సేవల వాటా (వడ్డీ చెల్లింపులు కలుపుకుని) ఐదు సంవత్సరాలకు గాను గత మూడు సంవత్సరాలలో క్రమంగా తగ్గుతూ వచ్చి ప్రస్తుత సంవత్సరం ఇది 28.73 శాతం కు పెరిగింది. 2010-11 లో మొత్తం వ్యయంలో సాంఘిక సేవల వాటా 35 శాతం, ఆర్థిక సేవల వాటా 32 శాతం ఉన్నాయి.

ఎంపిక చేసిన కొన్ని సామాజిక, ఆర్థిక సేవల నిర్వహణపై క్యాపిటల్ ఖర్చు, రెవెన్యూ ఖర్చులోని అంశాల వివరాలు **పట్టిక 1.8** లో ఉన్నాయి.

**పట్టిక 1.8: ఎంపిక చేసిన కొన్ని సామాజిక, ఆర్థిక సేవలపై ఖర్చుల వినియోగంలో సమర్థత**

*(శాతంలో)*

| సామాజిక/ఆర్థిక మౌలిక వసతులు | 2009-10 | | | 2010-11 | | |
|---|---|---|---|---|---|---|
| | టి.ఇ. తో సి.ఇ. నిష్పత్తి | ఆర్.ఇ. లో వాటా | | టి.ఇ. తో సి.ఇ. నిష్పత్తి | ఆర్.ఇ. లో వాటా | |
| | | ఎస్.&డబ్ల్యు. | ఓ.&ఎమ్. | | ఎస్.&డబ్ల్యు. | ఓ&ఎమ్ |
| **సామాజిక సేవలు (ఎస్.ఎస్.)** | | | | | | |
| సాధారణ విద్య | 0.50 | 86.56 | 0.33 | 0.40 | 68.26 | 0.14 |
| ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం | 1.22 | 58.91 | 0.41 | 0.43 | 49.12 | 0.56 |
| నీటి సరఫరా, పారిశుధ్యం, గృహ నిర్మాణం, పట్టణాభివృద్ధి | 7.49 | 13.58 | 0.66 | 6.22 | 17.12 | 3.00 |
| **మొత్తం (ఎస్.ఎస్.)** | **2.42** | **41.85** | **0.05** | **1.85** | **38.02** | **0.46** |
| **ఆర్థిక సేవలు (ఇ.ఎస్.)** | | | | | | |
| వ్యవసాయ, అనుబంధ కార్యకలాపాలు | 0.03 | 27.39 | 0.17 | 1.02 | 31.62 | 0.60 |
| నీటిపారుదల, వరదల నియంత్రణ | 67.37 | 7.95 | 7.09 | 58.16 | 4.86 | 9.46 |
| విద్యుచ్ఛక్తి, ఇంధనం | 0.31 | 0.92 | --- | 0.57 | 0.30 | 0.11 |
| రవాణా | 51.54 | 7.31 | 66.19 | 50.77 | 2.67 | 66.54 |
| **మొత్తం (ఇ.ఎస్.)** | **44.62** | **15.09** | **7.66** | **34.97** | **12.60** | **6.81** |
| **మొత్తం (ఎస్.ఎస్. + ఇ.ఎస్.)** | **24.61** | **31.51** | **2.99** | **12.28** | **18.75** | **1.87** |

టి.ఇ.: మొత్తం వ్యయం; సి.ఇ.: క్యాపిటల్ వ్యయం; ఆర్.ఇ.: రెవెన్యూ వ్యయం; ఎస్.&డబ్ల్యు.: జీతాలు, వేతనాలు; ఓ.&ఎమ్.: ఆపరేషన్, నిర్వహణ

క్యాపిటల్ వ్యయం ప్రాధాన్యత గురించి రాష్ట్ర ఎఫ్.ఆర్.బి.ఎమ్. చట్టంలో నిర్దిష్టమైన నియమాలేవీ లేనప్పటికీ, 2010-11 లో క్యాపిటల్ ఖర్చు తగ్గటం రాష్ట్రంలో ఆస్తుల కల్పనకు తగిన ప్రాధాన్యత ఇవ్వకపోవటాన్ని సూచిస్తోంది. ప్రత్యేకించి సాధారణ విద్య, ఆరోగ్యం వంటి సామాజిక సేవలపై క్యాపిటల్ వ్యయం నిష్పత్తి ఒకటి కన్నా తక్కువగా ఉంది. ఇంత ముఖ్యమైన విభాగాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదు. ఆర్థిక సేవలలో నీటిపారుదల, వరదల నియంత్రణ, రవాణా రంగాల పనితీరు ప్రోత్సాహకరంగానే ఉన్నప్పటికీ, ఇంధన విభాగంలో ఆస్తుల కల్పన సంతృప్తికరంగా లేదు. ఇంధన రంగంలో ఆస్తులు, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవలసి ఉంది. *2010-11 లో ఆపరేషన్, నిర్వహణ ఖర్చు (₹ 1,668 కోట్లు) రెవెన్యూ రాబడుల్లో 2.06 శాతం గానూ, రెవెన్యూ వ్యయంలో 2.12 శాతం గానూ ఉంది.*

## 1.9 ప్రభుత్వ ఖర్చు, పెట్టుబడులపై ఆర్థికపరమైన విశ్లేషణ

ద్రవ్య బాధ్యతల చట్టాన్ని అమలు చేయటం మొదలుపెట్టిన తర్వాతి కాలంలో, రాష్ట్ర ప్రభుత్వం తన ద్రవ్యలోటును (మరియు ఋణాలను) స్వల్ప స్థాయిల్లో ఉంచుతూనే, క్యాపిటల్ ఖర్చు/పెట్టుబడుల (లోన్లు, అడ్వాన్సులతో సహా) అవసరాలను కూడా నెరవేర్చవలసి ఉంది. అంతే కాకుండా, మార్కెటు ఆధారిత వనరుల పైనే పూర్తిగా ఆధారపడే క్రమంలో, రాష్ట్ర ప్రభుత్వం, తన పెట్టుబడులపై తగిన ప్రతిఫలం వచ్చేలాగానూ, ఋణాల రూపంలో తెచ్చిన నిధుల ఖర్చు భారాన్ని పరోక్షంగా అవ్యక్త సబ్సిడీల రూపంలో బడ్జెటుపై మోపకుండా ఆ ప్రతిఫలం నుండే రాబట్టుకునే లాగానూ చర్యలు చేపట్టాల్సి ఉంది. ఈ ఏడాదిలోనూ, గత సంవత్సరాల్లోనూ ప్రభుత్వ పెట్టుబడులు, ఇతర క్యాపిటల్ ఖర్చులపై విస్తృతమైన ఆర్థిక విశ్లేషణను ఈ విభాగంలో ఇవ్వడమైంది.

### *1.9.1 అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులు*

అసంపూర్తిగా ఉన్న పనుల్లో నిధులు స్తంభించిపోవటం ఖర్చులలోని నాణ్యత లేమిని సూచిస్తుంది. ప్రభుత్వం ఇచ్చిన సమాచారం ప్రకారం 2011 మార్చి 31 నాటికి పూర్తి కావలసిన 188 ప్రాజెక్టులు/పనులు అసంపూర్తిగా ఉన్నాయి. వీటిపై ఇంతవరకూ మొత్తం ₹ 46,330 కోట్లు ఖర్చయ్యింది. ఇంతే కాక, వీటిలో 98 ప్రాజెక్టులు/పనుల అసలు వ్యయాన్ని ప్రభుత్వం ₹ 63,890 కోట్లకు సవరించింది. ఈ ప్రాజెక్టులు/పనులను నిర్ణీత కాలంలో పూర్తి చేయకపోవడటంతో ఖర్చు పెరగటమే కాక రాష్ట్రం ఆశించిన ప్రయోజనాలు చాలా కాలంగా నెరవేరటం లేదు.

ఒక్కొక్క దానికీ ₹ కోటి పైగా ఖర్చు చేసి, అసంపూర్తిగా మిగిలిన ప్రాజెక్టుల వివరాలు, శాఖల వారీగా **పట్టిక 1.9** లో ఇవ్వడమైంది. భారీ, మధ్య తరహా సాగునీటి ప్రాజెక్టుల వివరాలు **అనుబంధం 1.8** లో చూడవచ్చు.

**పట్టిక 1.9 : శాఖల వారీగా అసంపూర్ణ ప్రాజెక్టులు/పనుల చిత్రణ**

**(₹ కోట్లలో)**

| పనుల స్వభావం | అసంపూర్ణ ప్రాజెక్టుల సంఖ్య | అసలు వ్యయం | సవరించిన మొత్తం వ్యయం | అదనపు వ్యయం | 31-3-2011 నాటికి మొత్తం వ్యయం |
|---|---|---|---|---|---|
| **నీటి పారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ** | | | | | |
| సాగునీటి ప్రాజెక్టులు | 49 | 42,436 | 63,716 (34 ప్రాజెక్టులు) | 28,498 (33 ప్రాజెక్టులు) | **46,182** |
| **రోడ్లు, వంతెనల శాఖ** | | | | | |
| రోడ్లు, వంతెనలు | 65 | 150 | 137 (61 ప్రాజెక్టులు) | 4 (7 ప్రాజెక్టులు) | **34** |
| **పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ** | | | | | |
| రోడ్లు | 66 | 181 | 37 (3 ప్రాజెక్టులు) | 3 (3 ప్రాజెక్టులు) | **86** |
| భవనాలు | 8 | 34 | -- | -- | **28** |
| మొత్తం | **188** | **42,801** | **63,890 (98 ప్రాజెక్టులు)** | **28,505 (43 ప్రాజెక్టులు)** | **46,330** |

వీటిలో కొన్ని ప్రాజెక్టులను మచ్చుకు తనిఖీ చేయగా, స్థల సేకరణ ప్రక్రియ, డిజైనులు ఖరారు చేయడం, ఆమోదించడం, టెండరు ప్రక్రియల వంటి సుదీర్ఘ విధానాల వలన నిర్మాణ పనులు కాలాతీతమవుతున్నాయని, ఆయా పనులకు కేటాయించిన నిధులు ఈ సంవత్సరం నిరుపయోగంగా మిగిలిపోయాయని తెలిసింది.

### *1.9.2 పెట్టుబడులు - ప్రతిఫలం*

రాష్ట్ర ప్రభుత్వం 2011 మార్చి 31 నాటికి చట్టబద్ధమైన కార్పోరేషన్లు, ప్రభుత్వ కంపెనీలు, జాయింట్ స్టాకు కంపెనీలు, సహకార సంస్థలలో ₹ 6,046 కోట్లను పెట్టుబడిగా పెట్టింది **(పట్టిక 1.10).**

**పట్టిక 1.10 : పెట్టుబడులపై ప్రతిఫలం**

| పెట్టుబడి/ప్రతిఫలం/ఋణాలపై ఖర్చు | 2006-07 | 2007-08 | 2008-09 | 2009-10 | 2010-11 |
|---|---|---|---|---|---|
| ఏడాది ముగిసే నాటికి పెట్టుబడి (₹ కోట్లలో) | 5,776 | 5,931 | 5,979 | 6,003 | **6,046** |
| ప్రతిఫలం (₹ కోట్లలో) | 47 | 12 | 19 | 23 | **39** |
| ప్రతిఫలం (శాతం) | 0.81 | 0.20 | 0.32 | 0.38 | **0.65** |
| ప్రభుత్వం తీసుకున్న ఋణాలపై సగటు వడ్డీ రేటు (శాతం) | 8.76 | 8.25 | 7.88 | 7.86 | **7.60** |
| వడ్డీ రేటు, ప్రతిఫలాల మధ్య వ్యత్యాసం (శాతం) | **7.94** | **8.05** | **7.57** | **7.48** | **6.95** |

ప్రభుత్వం 2010-11 లో తన పెట్టుబడుల మీద ₹ 39 కోట్ల ప్రతిఫలం పొందింది. ఇది 2009-10 సంవత్సరపు ప్రతిఫలం కంటే ₹ 16 కోట్లు ఎక్కువ. 2006-11 మధ్య కాలంలో పెట్టుబడుల మీద సగటు ప్రతిఫలం రేటు 0.47 శాతం కాగా ఇదే సమయంలో చెల్లించిన వడ్డీ సగటు రేటు 7.60 శాతం.

2011 మార్చి నాటికి కొనసాగుతున్న 48 కంపెనీలు/కార్పోరేషన్లలో (45 ప్రభుత్వ కంపెనీలు, 3 చట్టబద్ధమైన కార్పోరేషన్లు) ప్రభుత్వ పెట్టుబడి ఉంది. పద్దులు ఖరారు అయిన సంవత్సరం వరకూ తొమ్మిది[11] కంపెనీలు/కార్పోరేషన్లు ₹ 684 కోట్ల నష్టాన్ని చవిచూశాయి. పేరుకుపోయిన నష్టం ₹ 5,282 కోట్లు ఉంది. ఇతర సంస్థల్లో ఏ.పి. స్టేట్ హౌసింగ్ కార్పోరేషన్ లిమిటెడ్ (₹ 2,929 కోట్లు), ఎ.పి.ఎస్.ఆర్.టి.సి. (₹ 1,984 కోట్లు) నష్టదాయకంగా ఉన్నాయి. ఏడు కంపెనీలు/కార్పోరేషన్లు (-) ₹ 3,129 కోట్ల ప్రతికూల నికర మూల్యం ఇంకా ఎనిమిది కంపెనీలు/కార్పోరేషన్లు ప్రతి షేరుపై (-) ₹ 14.01 లక్షల ప్రతికూల ఆదాయం కలిగి ఉన్నాయి. ఇంకా సి.ఎ.జి., చట్టబద్ధ ఆడిటర్ల వ్యాఖ్యల ప్రభావం పరిగణనలోకి తీసుకుంటే మొత్తం 48 కంపెనీలు/కార్పోరేషన్లకు సంబంధించి పద్దులు ఖరారు అయిన సంవత్సరాంతానికి (2008-09 నుంచి 2010-11) చూపుతున్న సమగ్ర నికర లాభం ₹ 517.53 కోట్లు, ₹ 199.20 కోట్ల సమగ్ర నికర నష్టంగా రూపాంతరం చెందుతుంది.

రాష్ట్ర స్థాయి ప్రభుత్వ రంగ సంస్థలలో వాటా మూలధనం, ఋణాల రూపంలో పెట్టిన భారీ పెట్టుబడులు ఆయా సంస్థల నుంచి ప్రభుత్వ ఖజానాలోకి తగు ప్రతిఫలాన్ని ఆశిస్తాయి. ఇందుకు విరుద్ధంగా, ఈ సంస్థలు రాష్ట్ర ప్రభుత్వానికి గుదిబండలుగా మారాయి. పెట్టిన పెట్టుబడి మీద సగటు ప్రతిఫలం హీన స్థాయిలోనే కొనసాగుతోంది.

### *1.9.3 రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన లోన్లు, అడ్వాన్సులు*

సహకార సంఘాలు, కార్పోరేషన్లు, కంపెనీలలో పెట్టుబడులు పెట్టడంతో పాటు, వీటి లోని పలు సంస్థలకు ప్రభుత్వం లోన్లు, అడ్వాన్సులు కూడా అందజేస్తోంది. 2011 మార్చి 31 నాటికి ప్రభుత్వానికి రావాల్సి ఉన్న లోన్లు, అడ్వాన్సుల బకాయిలు, గత మూడేళ్ళలో పరిస్థితి **పట్టిక 1.11** లో ఉన్నాయి.

[11] 1. ఎ.పి. అర్బన్ ఆర్థిక, మౌలిక అభివృద్ధి కార్పోరేషన్ లిమిటెడ్, 2. ఫ్యాబ్ సిటీ (ఇండియా) ప్రై. లిమిటెడ్, 3. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్, 4. దామోదర మినరల్స్ ప్రై. లిమిటెడ్, 5. ఏ.పి. స్టేట్ ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ లిమిటెడ్, 6. ఏ.పి. స్టేట్ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ లిమిటెడ్, 7. ఏ.పి. స్టేట్ హౌసింగ్ కార్పోరేషన్ లిమిటెడ్, 8. లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఆఫ్ ఏ.పి. లిమిటెడ్, 9. ది నిజాం షుగర్స్ లిమిటెడ్

పట్టిక 1.11 : రాష్ట్రప్రభుత్వం ఇచ్చిన లోన్లపై వచ్చిన సగటు వడ్డీ

(₹ కోట్లలో)

| లోన్ల మొత్తం/వడ్డీ రాబడులు/ఋణాలపై ఖర్చు | 2008-09 | 2009-10 | 2010-11 | |
|---|---|---|---|---|
| | | | బడ్జెట్ అంచనాలు | వాస్తవ విలువలు |
| ప్రారంభ నిల్వ | 13,378 | 16,421 | --- | 17,868 |
| ఈ సంవత్సరం ఇచ్చిన మొత్తం | 3,413 | 1,590 | 2,490 | 3,315 |
| ఈ సంవత్సరం వసూలైన మొత్తం | 370 | 143 | 296 | 172 |
| **ముగింపు నిల్వ** | **16,421** | **17,868** | **2,786** | **21,011** |
| ***ఇందులో*** నిబంధనలు, షరతులు ఖరారైన ఋణాల బకాయిలు | స.లే. | స.లే. | స.లే. | స.లే. |
| నికర పెరుగుదల | 3,043 | 1,447 | 2,194 | 3,142 |
| వడ్డీ రాబడి | 21 | 32 | 45 | 60 |
| రావలసిన లోన్లు, అడ్వాన్సులలో వడ్డీ రాబడుల శాతం | 0.13 | 0.18 | --- | 0.29 |
| బకాయి ఉన్న రాష్ట్ర ప్రభుత్వ ద్రవ్య బాధ్యతలలో వడ్డీ చెల్లింపుల శాతం | 7.54 | 7.44 | --- | 7.17 |
| వడ్డీ రాబడులు, వడ్డీ చెల్లింపుల మధ్య వ్యత్యాసం (శాతం) | (-)7.41 | (-)7.26 | --- | (-)6.88 |

స.లే. : సమాచారం లేదు

పట్టణాభివృద్ధి సంస్థలు (₹ 960 కోట్లు) రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ (₹ 902 కోట్లు) ఈ సంవత్సరం అధికంగా ఋణాలు పొందాయి. మున్సిపాలిటీలు, స్థానిక సంస్థలు, పంచాయితీరాజ్ సంస్థల నుంచి 2010-11 సంవత్సరాంతానికి ₹ 23,047 కోట్లు వసూలు కావలసి ఉంది. ఇందులో అసలు ₹ 18,053 కోట్లు కాగా వడ్డీ ₹ 4,994 కోట్లు. ఈ మొత్తంలో ₹ 15,405 కోట్లు (అసలు : ₹ 11,083 కోట్లు, వడ్డీ : ₹ 4,322 కోట్లు) మూడు సంవత్సరాలకు పైగా బకాయిల్లో ఉన్నవి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ బోర్డు (ఎ.పి.ఎస్.ఇ.బి.) నుంచి రావలసిన ₹ 2,201 కోట్ల లోన్ల మొత్తంలో ₹ 561 కోట్ల మొత్తం లోన్లు 1999 జనవరి చివరికే కాలాతీతమయ్యాయి. విద్యుత్ బోర్డు 1999 ఫిబ్రవరి 1 నుంచి రెండు కంపెనీలుగా విడిపోయింది. ఐతే, బోర్డు ఆస్తులు, అప్పులను ప్రభుత్వం ఈ రెండు కంపెనీలకూ ఇంకా పంపకాలు చేయవలసి ఉంది. కనుక సంస్థకు అప్పుగా ఇచ్చిన మొత్తం ప్రభుత్వం ఏ విధంగా వసూలు చేసుకునేదీ తెలియదు.

రాష్ట్ర ప్రభుత్వం 2011 మార్చి వరకు ఇచ్చిన మొత్తం లోన్లు ₹ 14,423 కోట్లు బాకీ మొత్తాన్ని రూఢి చేస్తూ ఆయా శాఖల నుంచి కన్ఫర్మేషన్లు రావలసి ఉంది. ఆ విధంగా ధృవీకరణ ఇంకా రాని అత్యంత పాత బాకీ 1984-85 నాటిది. 2011 మార్చి 31 నాటికి ఈ విధంగా బాకీ మొత్తం ధృవీకరించవలసి ఉన్న వాటిలో గృహనిర్మాణం (₹ 9,398 కోట్లు), పట్టణాభివృద్ధి (₹ 1,613 కోట్లు) శాఖలు ప్రధానమైనవి.

### *1.9.4 నగదు నిల్వలు, నగదు నిల్వల పెట్టుబడి*

ఈ సంవత్సరం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ₹ 4,534 కోట్లు భారత ప్రభుత్వ ట్రెజరీ బిల్లులలో పెట్టుబడి పెట్టింది. గత సంవత్సరం ఈ పెట్టుబడి ₹ 2,274 కోట్లు. ఈ సంవత్సరంలో నగదు నిల్వలు, వాటి నుంచి ప్రభుత్వం పెట్టిన పెట్టుబడుల వివరాలు **పట్టిక 1.12** లో ఉన్నాయి.

**పట్టిక 1.12 : నగదు నిల్వలు - వాటి పెట్టుబడి**

**(₹ కోట్లలో)**

| వివరాలు | 2010 ఏప్రియల్ 1 నాటికి | 2011 మార్చి 31 నాటికి | పెరుగుదల/ తగ్గుదల |
|---|---|---|---|
| నగదు నిల్వలు | 5,983 | 8,830 | 2,847 |
| నగదు నిల్వల నుంచి పెట్టుబడులు | 2,274 | 4,534 | 2,260 |
| ఎ. భారత ప్రభుత్వ ట్రెజరీ బిల్లులు | 2,274 | 4,534 | 2,260 |
| బి. భారత ప్రభుత్వ సెక్యూరిటీలు | --- | --- | --- |
| సి. ఇతర సెక్యూరిటీలు | --- | --- | --- |
| డి. ఇతర పెట్టుబడులు | --- | --- | --- |
| ప్రత్యేకించిన నిధుల నుంచి పెట్టిన పెట్టుబడుల వివరాలు - నిధుల వారీగా | 3,674 | 4,525 | 851 |
| ఎ. సింకింగ్ ఫండ్ | 3,063 | 3,843 | 780 |
| బి. గ్యారంటీ రిడెంప్షన్ ఫండ్ | 597 | 668 | 71 |
| సి. ఇతర నిధులు | 14 | 14 | 0 |
| వచ్చిన వడ్డీ | 377 | 451 | 74 |

2010-11 లో నగదు నిల్వల నుంచి పెట్టుబడి పెట్టగా 2.73 శాతం, ప్రత్యేకించిన నిధుల నుంచి పెట్టుబడి పెట్టగా 7.24 శాతం వడ్డీ వచ్చింది. ఐతే, మార్కెట్ ఋణాల సగటు వడ్డీ రేటు 7.60 శాతం ఉంది.

రాష్ట్ర ప్రభుత్వం భారతీయ రిజర్వు బ్యాంకు వద్ద రోజువారీ కనీస నగదు నిల్వ ₹ 3.32 కోట్లను 2010-11 లో 362 రోజులు ఉంచింది. మూడు రోజులు ₹ 218 కోట్లు వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సు పొందింది.

## 1.10 ఆస్తులు - అప్పులు

### *1.10.1 ఆస్తులు, అప్పుల పెరుగుదల, కూర్పు*

ప్రభుత్వ పద్దుల నిర్వహణకు సంబంధించిన ప్రస్తుత విధానంలో ప్రభుత్వ అధీనంలో ఉన్న భూములు భవనాల వంటి స్థిరాస్తులను సమగ్రంగా పద్దుల్లో చూపడం జరగదు. ఐతే ప్రభుత్వ ఆర్థిక బాధ్యతలనూ, చేసిన ఖర్చుల ద్వారా సమకూర్చుకొన్న ఆస్తులను మాత్రమే ప్రభుత్వ పద్దుల్లోకి తీసుకోవడం జరుగుతుంది. 2011 మార్చి 31 నాటికి ప్రభుత్వ ఆస్తులు - అప్పుల సంక్షిప్త వివరాలను 2010 మార్చి 31 నాటి స్థితితో పోలుస్తూ ***అనుబంధం 1.9*** లో ఇవ్వడమైంది. అప్పుల జాబితాలో ముఖ్యంగా అంతర్గత ఋణాలు, భారత ప్రభుత్వం నుండి పొందిన లోన్లు, అడ్వాన్సులు, ప్రజా పద్దుల కింద రాబడులు, రిజర్వు నిధులు ఉంటాయి. ఆస్తులలో ప్రధానంగా క్యాపిటల్ పరివ్యయం, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన లోన్లు, అడ్వాన్సులు, నగదు నిల్వలు ఉంటాయి.

రాష్ట్ర ఎఫ్.ఆర్.బి.ఎమ్. చట్టంలో నిర్వచించిన ప్రకారం, రాష్ట్ర ప్రభుత్వపు మొత్తం అప్పులంటే - 'రాష్ట్ర సంచిత నిధి, రాష్ట్ర ప్రజాపద్దుల కింద అప్పులు. ఇంకా ప్రభుత్వరంగ సంస్థలు, ప్రత్యేక ప్రయోజనార్థం ఏర్పరచిన సాధనాల (స్పెషల్ పర్పస్ వెహికల్స్) ఋణాలు, రాష్ట్ర బడ్జెట్ల నుండి తిరిగి చెల్లించాల్సిన అప్పులకు హామీలు (అసలు మరియు/లేదా వడ్డీ) అలాంటి ఇతర ఆర్థిక సాధనాలు కూడా ఉంటాయి'.

### *1.10.2 ద్రవ్య బాధ్యతలు*

రాష్ట్ర ప్రభుత్వం తీర్చాల్సి ఉన్న ద్రవ్య బాధ్యతల సరళిని ***అనుబంధం 1.6*** లో చూపడమైంది. ఈ ఏడాది ద్రవ్య బాధ్యతల కూర్పు **చార్టు 1.13** లోనూ, గత ఏడాది ద్రవ్య బాధ్యతల కూర్పు **చార్టు 1.14** లోనూ ఉన్నాయి.

**చార్టు 1.13 : 31-3-2011 నాటికి తీర్చాల్సిన ద్రవ్య బాధ్యతలు (₹ కోట్లలో)**




**చార్టు 1.14 : 31-3-2010 నాటికి తీర్చాల్సి ఉన్న ద్రవ్య బాధ్యతలు (₹ కోట్లలో)**




రాష్ట్ర ప్రభుత్వపు మొత్తం ద్రవ్య బాధ్యతలు 2010-11 సంవత్సరాంతానికి ₹ 1,34,905 కోట్లు. ఇవి గత సంవత్సరం (₹ 1,19,807 కోట్లు) కంటే ₹ 15,098 కోట్లు ఎక్కువ (13 శాతం). ఇది రెవెన్యూ రాబడులకు 1.67 రెట్లు ఉన్నది.

ఎఫ్.ఆర్.బి.ఎమ్. చట్టంలో నిర్వచించిన విధంగా లెక్కిస్తే ఈ ఏడాది ముగిసే నాటికి ద్రవ్య బాధ్యతల మొత్తం ₹ 1,39,186 కోట్లు[12]. ఇది జి.ఎస్.డి.పి. లో 24.52 శాతం ఉంది. ఎఫ్ .ఆర్.బి.ఎమ్. చట్టంలో నిర్దేశించిన పరిమితి 30.30 శాతం. 2014-15 నాటికి అన్ని రాష్ట్రాలూ తమ ద్రవ్య బాధ్యతలను జి.ఎస్.డి.పి. లో 25 శాతానికి తగ్గించుకోవాలని పదమూడవ ఆర్థిక సంఘం ఇచ్చిన సూచనను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసింది. ఎఫ్.ఆర్.బి.ఎమ్. చట్టం, పన్నెండవ ఆర్థిక సంఘం సిఫార్సులకు అనుగుణంగా ఋణాభారాన్ని తగ్గించుకోవడానికి లేదా వదిలించుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం నిక్షిప్త నిధి (సింకింగ్ ఫండ్) ని, పూచీ విమోచన నిధి (గ్యారంటీ రిడెంప్షన్ ఫండ్) ని ఏర్పాటు చేసింది. భారతీయ రిజర్వు బ్యాంకు నిర్దేశించిన రేట్ల ప్రకారం వీటిలో నిధులను జమ చేస్తూ వస్తోంది.

### *1.10.3 గ్యారంటీల స్థితి - ఋణ బాధ్యతలుగా మారే అవకాశం*

రాష్ట్ర ప్రభుత్వం పూచీ ఇచ్చిన ఋణ గ్రహీతలు ఋణాలను తిరిగి చెల్లించని పక్షంలో ఆ గ్యారంటీలు రాష్ట్ర సంచిత నిధిపై ఋణ బాధ్యతలుగా మారుతాయి. ఏదైనా ఒక ఏడాదిలోని వార్షిక ఇంక్రిమెంటల్ రిస్క్ వెయిటెడ్ గ్యారంటీల మొత్తం అంతకుముందు ఏడాదిలోని మొత్తం రెవెన్యూ రాబడుల్లో 90 శాతం మించకూడదని రాష్ట్ర ప్రభుత్వం తన ఎఫ్.ఆర్.బి.ఎమ్. చట్టంలోనే పరిమితి విధించుకుంది. పూచీల విముక్తి కోసం రాష్ట్ర ప్రభుత్వం పూచీ విముక్తి నిధిని (గ్యారంటీ రిడెంప్షన్ ఫండ్) ని 2002 జనవరిలో ఏర్పాటు చేసింది. ఈ సంవత్సరం ₹ 78 కోట్లు ఈ నిధికి జమ చేసింది. 2011 మార్చి నాటికి ఉన్న మొత్తం ముగింపు నిల్వను (₹ 668 కోట్లు) ప్రభుత్వ సెక్యూరిటీలలో పెట్టుబడి పెట్టింది.

ఫైనాన్స్ అకౌంట్స్‌లోని 9 వ స్టేట్‌మెంట్ ప్రకారం గత మూడేళ్ళకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం గ్యారంటీ ఇచ్చిన గరిష్ఠ మొత్తాలు, అందులో ఇప్పటికీ మిగిలి ఉన్న గ్యారంటీ మొత్తాల వివరాలు **పట్టిక 1.13** లో ఉన్నాయి.

---

[12] సంచిత నిధి, ప్రజా పద్దుల బాధ్యతలు (₹ 1,34,905 కోట్లు), బకాయి ఉన్న గ్యారంటీలు రాష్ట్ర బడ్జెటు నుండి చెల్లించాల్సినవి (₹ 2,987 కోట్లు), బకాయి ఉన్న బడ్జెటేతర ఋణాలు (₹ 1,294 కోట్లు)

**పట్టిక 1.13 : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇచ్చిన పూచీలు**

(₹ కోట్లలో)

| గ్యారంటీలు | 2008-09 | 2009-10 | 2010-11 |
|---|---|---|---|
| పూచీ ఇచ్చిన గరిష్ఠ మొత్తం | 29,990 | 20,324 | **29,554** |
| మిగిలి ఉన్న పూచీలు | 15,239 | 13,135 | **12,290** |
| మొత్తం రెవెన్యూ రాబడుల్లో పూచీ ఇచ్చిన గరిష్ఠ మొత్తపు శాతం | **47.71** | **31.42** | **36.49** |

పూచీ ఇచ్చిన గరిష్ఠ మొత్తం ₹ 29,554 కోట్లు కాగా, ఇది ఎఫ్.ఆర్.బి.ఎమ్. చట్టం నిర్దేశించిన విధంగా నిరుటి రెవెన్యూ వసూళ్ళ (₹ 58,210 కోట్లు) లో 90 శాతం పరిమితికి లోబడే ఉంది. 2010-11 లో పూచీ ఇచ్చిన గరిష్ఠ మొత్తం గత సంవత్సరం ఇచ్చిన దాని కంటే ₹ 9,230 కోట్లు పెరిగింది. విద్యుత్ విభాగంలో ఏ.పి. ట్రాన్స్‌కో (₹ 8,058 కోట్లు), ఎ.పి.పి.ఎఫ్.సి. (₹ 1,500 కోట్లు), రోడ్డు, రవాణా రంగం కింద ఎ.పి.ఎస్.ఆర్.టి.సి. (₹ 517 కోట్లు) లలో ప్రధానంగా పెరుగుదల ఉంది. గ్యారంటీ కమీషను రూపేణా ఈ ఏడాది ప్రభుత్వానికి ₹ 70 లక్షలు లభించగా, ఇంకా ₹ 21.57 కోట్లు వివిధ సంస్థల నుంచి రావలసి ఉంది.

### *1.10.4 బడ్జెటేతర ఋణాలు*

రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే ఋణాలు భారత రాజ్యాంగపు 293 వ అధికరణకు లోబడి ఉంటాయి. **పట్టిక 1.13** లో చూపిన ద్రవ్య బాధ్యతలే కాకుండా, ప్రభుత్వ కంపెనీలు/కార్పోరేషన్లు తీసుకున్న లోన్లకు కూడా రాష్ట్ర ప్రభుత్వం గ్యారంటీ ఇచ్చింది. బడ్జెట్ లో పొందుపరచని రాష్ట్ర ప్రణాళికా కార్యక్రమాల అమలు కోసం ఈ కంపెనీలు/కార్పోరేషన్లు మార్కెట్/ఆర్థిక సంస్థల నుండి నిధులను అప్పుగా తీసుకున్నాయి. ఈ కార్యక్రమాలకు నిధులను రాష్ట్ర బడ్జెటు నుండి కాకుండా, ఆయా కంపెనీలు/కార్పోరేషన్లు సమీకరించుకున్న వనరుల నుండే ఖర్చు చేయడం జరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వం అంచనాలు వేసినప్పటికీ, వాస్తవానికి చాలామటుకు సంస్థల ఋణాలు చివరికి రాష్ట్ర ప్రభుత్వపు ద్రవ్య బాధ్యతలుగా మారుతాయి. అలా ఇవి బడ్జెటు వెలుపలి ఋణాలుగా పరిణమిస్తాయి.

సర్దుబాటు బాండ్ల ద్వారానూ బ్యాంకుల నుండీ, ప్రైవేటు గానూ ఎ.పి. ట్రాన్స్‌కో 2001-09 లో తీసుకున్న బడ్జెటేతర ఋణం ₹ 2,231 కోట్లకు గాను ప్రభుత్వం 2009-10 వరకూ ₹ 894 కోట్లు తీర్చగా ఇంకా ₹ 1,337 కోట్లు బాకీ మిగిలి ఉంది. ఈ సంవత్సరం ప్రభుత్వం కొత్తగా బడ్జెటేతర ఋణం తీసుకోలేదు కానీ గత సంవత్సరాల తాలూకు అసలు ₹ 43 కోట్లు, వడ్డీ ₹ 115 కోట్లు తీర్చింది. ఇంకా ₹ 1,294 కోట్ల బాకీ మిగిలి ఉంది.

2011 మార్చి ముగిసే నాటికి రాష్ట్ర ప్రభుత్వం మొత్తం అప్పులు ₹ 1,48,489 కోట్లు. ఇందులో ద్రవ్య బాధ్యతలు ₹ 1,34,905 కోట్లు, బడ్జెటేతర ఋణాలు ₹ 1,294 కోట్లు, వడ్డీతో కలిపి మిగిలి ఉన్న గ్యారంటీలు ₹ 12,290 కోట్లు ఉన్నాయి. జి.ఎస్.డి.పి. తో లెక్కిస్తే వీటి నిష్పత్తి 26.16 శాతం ఉంది. ఇది ఎఫ్.ఆర్.బి.ఎమ్. చట్టంలో నిర్దేశించిన 30.3 శాతం పరిమితి కన్నా తక్కువ.

## 1.11 ఋణాలను భరించే సామర్థ్యం

రాష్ట్ర ప్రభుత్వపు అప్పుల పరిమాణంతో పాటుగా ప్రభుత్వానికి ఋణాలను భరించే సామర్థ్యం[13] ఏ మేరకు ఉందో తెలియజేసే వివిధ సూచికలను కూడా విశ్లేషించడం అవసరం. ఋణ స్థిరీకరణ[14], ఋణాలు కాని రాబడులు[15] ఎంతమేరకు సరిపోతాయి,

13 పేజి 87 లోని పారిభాషిక పదకోశం చూడండి

14 పేజి 87 లోని పారిభాషిక పదకోశం చూడండి

15 పేజి 87 లోని పారిభాషిక పదకోశం చూడండి

ఋణాల ద్వారా సమీకరించుకున్న నిధుల నికర లభ్యత[16], వడ్డీ చెల్లింపుల భారం (రెవెన్యూ రాబడులు, వడ్డీ చెల్లింపుల మధ్య నిష్పత్తితో లెక్కించినది), రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీల మెచూరిటీ ప్రొఫైల్ అనే అంశాల పరంగా రాష్ట్ర ప్రభుత్వ ఋణ భరణ శక్తిని ఈ విభాగంలో అంచనా వేయటం జరిగింది. 2006-11 మధ్య గల ఐదేళ్ళ కాలానికి సంబంధించి, ఈ సూచికల పరంగా రాష్ట్ర ఋణ భరణ సామర్థ్యాన్ని **పట్టిక 1.14** లో విశ్లేషించడం జరిగింది.

**పట్టిక 1.14 ៖ ఋణ భరణ శక్తి ៖ సూచికలు, ధోరణులు**

| ఋణ భరణ శక్తి సూచికలు | 2006-07 | 2007-08 | 2008-09 | 2009-10 | 2010-11 |
|---|---|---|---|---|---|
| ఋణ స్థిరీకరణ (పరిమాణ విస్తృతి + ప్రాథమిక లోటు) (₹ కోట్లలో) | 9,311 | 13,796 | 10,861 | 12,800 | 18,101 |
| ఋణాలు కాని రాబడులు సరిపోవడం (వనరుల అంతరం) (₹ కోట్లలో) | (+) 2,657 | (-) 3,143 | (-)3,710 | (-) 1,603 | (+)2,207 |
| ఋణాల ద్వారా సమీకరించుకున్న నిధుల నికర లభ్యత (నిష్పత్తి) | (-) 0.01 | 0.13 | 0.03 | 0.07 | 0.08 |
| వడ్డీ చెల్లింపుల భారం (ఐ.పి., ఆర్.ఆర్ ల నిష్పత్తి) | 0.16 | 0.14 | 0.13 | 0.14 | 0.12 |

గత ఐదేళ్ళుగా పరిమాణ విస్తృతి, ప్రాథమిక లోటు రెంటినీ కలిపిన విలువ ధనాత్మకంగా ఉండడం వలన 2006-07 లో 0.29 గా ఉన్న ఋణం - జి.ఎస్.డి.పి.. ల నిష్పత్తి 2010-11 లో 0.24 కి తగ్గింది. ఈ ధోరణులు ఋణ స్థిరీకరణ వైపు పయనాన్ని సూచిస్తున్నాయి. దీని వలన అంతిమంగా రాష్ట్రం ఋణాలను భరించే సామర్థ్యం పెరుగుతుంది. మొత్తం ఐదు సంవత్సరాలకు గాను మూడు సంవత్సరాలలో వనరుల అంతరం ఋణాత్మకంగా ఉంది. ఐతే, ఈ సంవత్సరం ఇది ధనాత్మకంగా మారింది. పెరుగుతున్న ప్రాథమిక వ్యయం, వడ్డీ భారాన్ని భరించేందుకు పెరుగుతున్న ఋణేతర రాబడులు సరిపోతాయని ఇది సూచిస్తోంది. ఋణ విమోచనం (అసలు + వడ్డీ), మొత్తం ఋణ వసూళ్ళ మధ్య నిష్పత్తి 2006-07 లో ఋణాత్మకంగా ఉండి 2007-11 మధ్య కాలంలో ధనాత్మకంగా మారింది. ఋణాల ద్వారా సమీకరించుకున్న నిధులు పాత అప్పులను తీర్చేందుకే కాకుండా, ఇతర ప్రయోజనాలకు కూడా అందుబాటులో ఉండటాన్ని ఇది సూచిస్తుంది. రాష్ట్ర ఋణం తాలూకు మెచూరిటీ ప్రొఫైల్ **పట్టిక 1.15** లోనూ, **చార్టు 1.15** లోనూ ఇవ్వడమైనది.

**పట్టిక 1.15: రాష్ట్ర ఋణపు మెచూరిటీ ప్రొఫైల్**

**(₹ కోట్లలో)**

| మెచూరిటీ ప్రొఫైల్ | మొత్తం | శాతం |
|---|---|---|
| 0-1 సంవత్సరాలు | 4,740 | 4.99 |
| 1-3 సంవత్సరాలు | 11,235 | 11.82 |
| 3-5 సంవత్సరాలు | 9,998 | 10.52 |
| 5-7 సంవత్సరాలు | 13,316 | 14.00 |
| 7 సంవత్సరాలు, ఆ పైన | 55,783 | 58.67 |
| **మొత్తం** | **95,072** | **100.00** |

**చార్టు 1.15 ៖ రాష్ట్ర ఋణపు మెచూరిటీ ప్రొఫైల్**

**(₹ కోట్లలో)**




[16] పేజి 87 లోని పారిభాషిక పదకోశం చూడండి

గత ఐదేళ్ళలో సరిపడా ద్రవ్య మిగులు లేనందున, తన వ్యయ బాధ్యతలను నెరవేర్చటానికి ప్రభుత్వం మరింతగా అప్పులు చేయక తప్పదు. రాష్ట్ర ప్రభుత్వం మార్కెట్ ఋణాలు (₹ 37,318 కోట్లు) 2008-09, 2009-10, 2010-11 సంవత్సరాలలో గణనీయంగా పెరగటాన 2017-18 సంవత్సరం నుంచి చెల్లింపుల తాకిడి బాగా పెరగవచ్చు. రాష్ట్ర అభివృద్ధి ఋణాల (ఎస్.డి.ఎల్.) కు సంబంధించి 2011 మార్చి నాటి నిల్వల మెచూరిటీ ప్రొఫైల్‌ను పరిశీలిస్తే ఈ తరహా ఋణాలలో 62 శాతం ఋణాలు ఏడు సంవత్సరాలు, అంతకు మించి గడువులో ఉన్నాయి.

## 1.12 ద్రవ్య అసమతుల్యతలు

ఏదైనా ఒక నిర్దిష్ట కాలంలో రాష్ట్ర ప్రభుత్వపు మొత్తం ద్రవ్య అసమతుల్యతలు ఏ మేరకు ఉన్నాయనేది రెవెన్యూ లోటు, ద్రవ్య లోటు, ప్రాథమిక లోటు అనే మూడు కీలక ద్రవ్యపరామితులు తెలియజేస్తాయి. ప్రభుత్వ పద్దుల్లో లోటు అనేది దాని రాబడి, ఖర్చుల మధ్య అంతరాన్ని తెలియజేస్తుంది. ఈ లోటు స్వభావం ద్రవ్య నిర్వహణలో ప్రభుత్వ వివేకాన్ని సూచిస్తుంది. అంతేకాక, లోటును భర్తీ చేసిన విధానం, సమీకరించిన వనరులను వినియోగించిన వైనం, ప్రభుత్వపు ఆర్థిక పరిపుష్టికి సంకేతాలు. 2010-11 ఆర్థిక సంవత్సరంలో ఈ లోటును భర్తీ చేసిన ధోరణి, స్వభావం, పరిమాణం, తీరు, ఇంకా రెవెన్యూ, ద్రవ్యలోటుల విషయంలో ఎఫ్.ఆర్.బి.ఎమ్. చట్టం/నియమావళి కింద నిర్దేశించుకున్న లక్ష్యాలు, వాటి వాస్తవ స్థాయిల విశ్లేషణ ఈ విభాగంలో చూడవచ్చును.

### *1.12.1 వివిధ లోటుల సరళి*

2006-11 మధ్య కాలంలో లోటు సూచికల సరళిని **చార్టులు 1.16, 1.17** లలో చూపడమైంది.



చార్టు 1.16 : లోటు సూచికల సరళి



చార్టు 1.17 : జిఎస్‌డిపి తో పోలిస్తే లోటు సూచికల సరళి

2010-11 వరకూ వరుసగా ఐదు సంవత్సరాలు రెవెన్యూ మిగులు ఉంది. ప్రస్తుత సంవత్సరం మిగులు ₹ 2,462 కోట్లు కాగా, ఇది గత సంవత్సరపు ₹ 1,230 కోట్ల మీద ₹ 1,232 కోట్లు పెరిగింది. ద్రవ్య లోటు ప్రతి ఏటా మారుతూ 2009-10 నాటి ₹ 14,010 కోట్ల నుంచి 2010-11 లో ₹ 11,803 కోట్లకు తగ్గింది (16 శాతం). ప్రాథమిక లోటు 2009-10 లోని ₹ 5,096 కోట్ల నుంచి 2010-11 లో ₹ 2,128 కోట్లకు తగ్గిపోయింది (58 శాతం).

### *1.12.2 ద్రవ్యలోటు లోని అంశాలు, దాన్ని భర్తీ చేసిన వైనం*

ద్రవ్యలోటును భర్తీ చేసే తీరులో పలు మార్పులు చోటు చేసుకున్నాయి. వివరాలను **పట్టిక 1.16** లో చూపడమైంది.

**పట్టిక 1.16 ః ద్రవ్యలోటులోని అంశాలు - దాన్ని భర్తీ చేసిన తీరు**

**(₹ కోట్లలో)**

| వివరాలు | 2006-07 | 2007-08 | 2008-09 | 2009-10 | 2010-11 | | |
|---|---|---|---|---|---|---|---|
| | | | | | వసూళ్ళు | చెల్లింపులు | నికరం |
| ద్రవ్యలోటు విభజన | (-)5,644 | (-)8,786 | (-)12,407 | (-)14,010 | | | (-)11,803 |
| రెవెన్యూ లోటు/ మిగులు | 2,807 | 159 | 1,004 | 1,230 | 80,996 | 78,534 | 2,462 |
| నికర క్యాపిటల్ ఖర్చు | (-)8,015 | (-)6,216 | (-)10,367 | (-)13,793 | 0 | 11,123 | (-)11,123 |
| నికర లోన్లు, అడ్వాన్సులు | (-)436 | (-)2,729 | (-)3,044 | (-)1,447 | 173 | 3,315 | (-)3,142 |
| ద్రవ్య లోటును భర్తీ చేసిన తీరు | | | | | | | |
| మార్కెట్ ఋణాలు | 1,173 | 6,182 | 10,911 | 13,403 | 16,478 | 6,324 | 10,154 |
| భారత ప్రభుత్వం నుండి లోన్లు | (-)875 | (-)43 | (-)391 | 73 | 2,244 | 1,557 | 687 |
| చిన్న మొత్తాల పొదుపు, భవిష్యనిధి, వగైరా (క్రెడిట్ ) | 4,716 | 940 | 570 | 961 | 3,130 | 1,527 | 1,603 |
| రిజర్వు నిధులు (క్రెడిట్) | 19 | 252 | 271 | (-)113 | 3,536 | 2,591 | 945 |
| డిపాజిట్లు, అడ్వాన్సులు (క్రెడిట్) | 2,042 | 3,416 | (-)1,812 | (-)1,437 | 38,608 | 36,905 | 1,703 |
| అనామతు, వివిధాలు (డెబిట్) | (-)1,590 | (-)2,828 | 4,405 | (-)1 | 89,612 | 91,812 | (-)2,200 |
| జమలు (క్రెడిట్) | (-)34 | 943 | (-)1,621 | 1,435 | 15,030 | 16,381 | (-)1,351 |
| ఇతరాలు (కంటింజెన్సీ ఫండ్ | 1 | (-)1 | (-)6 | 7 | 0.43 | 1.54 | (-)1 |
| మొత్తం మిగులు/లోటు | 192 | (-)75 | 80 | (-)318 | --- | --- | 263 |

*ద్రవ్య ఏకీకరణ, ద్రవ్య స్థిరీకరణలో ప్రభుత్వం విశ్వశించదగిన ప్రగతిని సాధించింది. ఫలితంగా ఈ సంవత్సరం ద్రవ్యలోటు గత సంవత్సరం మీద ₹ 2,207* కోట్లు *తగ్గింది.* అంతేకాక, ఇది గత ఐదు సంవత్సరాలకు గాను నాలుగు సంవత్సరాలలో ద్రవ్య లోటు పెరిగే ధోరణిని నిలువరించగలిగింది. గత సంవత్సరంతో పోలిస్తే మొత్తం ఆదాయం, ఋణేతర వసూళ్లలో వృద్ధి, (25 శాతం) కంటే ఈ సంవత్సరం మొత్తం వ్యయం లో వృద్ధి రేటు తక్కువగా (18 శాతం) ఉంది. ద్రవ్యలోటును భర్తీ చేయటానికి 2010-11 లో మార్కెట్ ఋణాలు (₹ 12,000 కోట్లు) ప్రధాన వనరుగా తీసుకున్నారు.

### *1.12.3 లోటు/మిగులు నాణ్యత*

రెవెన్యూ లోటు, ద్రవ్య లోటు ల నిష్పత్తి, ప్రాథమిక లోటును ప్రాథమిక రెవెన్యూ లోటు[17], క్యాపిటల్ ఖర్చులు (ఋణాలు, అడ్వాన్సులతో సహా) గా విభజనలు రాష్ట్ర ఆర్థిక స్థితికి సంబంధించిన వివిధ లోటుల నాణ్యతను సూచిస్తాయి. రెవెన్యూ లోటు - ద్రవ్య లోటుల నిష్పత్తి విలువ ఋణాల ద్వారా సమీకరించుకున్న నిధులను ఆ ఆర్థిక సంవత్సరపు అవసరాలకు ఎంత మేరకు వినియోగించడం జరిగిందో సూచిస్తుంది. అంతే కాకుండా, రెవెన్యూ లోటు - ద్రవ్య లోటు ల నిష్పత్తి నిలకడగా హెచ్చు విలువను కలిగి ఉండడమనేది రాష్ట్రానికి ఆస్తుల ఆధారం క్రమంగా తగ్గుతూ ఉండటాన్నీ, ఋణాలలోని కొంత భాగానికి (ద్రవ్య బాధ్యతలకు) ఆస్తుల దన్ను లేకపోవడాన్ని సూచిస్తుంది. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ యొక్క ఉత్పాదక సామర్థ్యాన్ని మెరుగు పరిచేందుకు క్యాపిటల్ ఖర్చులో పెరుగుదల ఉండటం వాంఛనీయమే అయినా క్యాపిటల్ ఖర్చులోని పెరుగుదల లోటు ఏర్పడటానికి ఎంతమేరకు దోహదపడిందో ప్రాథమిక లోటు విభజన **(పట్టిక 1.17)** తెలియజేస్తోంది.

**పట్టిక 1.17 : ప్రాథమిక లోటు/మిగులు - అందులోని అంశాలు**

**(₹ కోట్లలో)**

| సంవత్సరం | ఋణాలుకాని రాబడులు | ప్రాథమిక రెవెన్యూ ఖర్చు | క్యాపిటల్ ఖర్చు | లోన్లు, అడ్వాన్సులు | ప్రాథమిక ఖర్చు[18] | ప్రాథమిక రెవెన్యూ లోటు (-)/ మిగులు (+) | ప్రాథమిక లోటు (-)/ మిగులు (+) |
|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 (3+4+5) | 7 (2-3) | 8 (2-6) |
| **2006-07** | 46,606 | 34,159 | 9,904 | 907 | 44,970 | (+)12,447 | **(+)1,636** |
| **2007-08** | 60,891 | 46,394 | 12,774 | 2,920 | 62,088 | (+)14,497 | **(-)1,197** |
| **2008-09** | 63,228 | 53,797 | 10,367 | 3,414 | 67,578 | (+)9,431 | **(-)4,350** |
| **2009-10** | 64,821 | 54,534 | 13,793 | 1,590 | 69,917 | (+)10,287 | **(-)5,096** |
| **2010-11** | **81,169** | **68,859** | **11,123** | **3,315** | **83,297** | **(+)12,310** | **(-)2,128** |

2006-11 మధ్య కాలంలోని ప్రాథమిక లోటు లేదా మిగులుకు కారణమైన అంశాలను పరిశీలించగా, రాష్ట్ర ప్రభుత్వం క్యాపిటల్ పద్దు కింద చేసిన ఖర్చులు, చెల్లించిన లోన్లు - అడ్వాన్సుల వల్లనే ఈ కాలంలోని అన్ని సంవత్సరాలలోనూ ప్రాథమిక లోటు ఏర్పడిందని తెలుస్తోంది. మరో విధంగా చెప్పాలంటే *ఋణేతర రాష్ట్ర రాబడులు ప్రాథమిక రెవెన్యూ ఖర్చుకు సరిపోవడమే కాకుండా పూర్తిగానో పాక్షికంగానో క్యాపిటల్ వ్యయాన్ని కూడా భరించగలిగాయి.* ఐతే ఋణేతర రాబడుల్లోని మిగుళ్ళు మొత్తం క్యాపిటల్ ఖర్చు, లోన్లు, అడ్వాన్సులను భరించటానికి సరిపడేంత లేకపోవడం వలన, 2006-07 లో తప్ప 2006-11 మధ్య కాలంలోని అన్ని సంవత్సరాలలోనూ ప్రాథమిక లోటు ఏర్పడింది.

## 1.13 సారాంశం

ఎఫ్.ఆర్.బి.ఎమ్. చట్టం అమలులో కొచ్చింది మొదలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏటా ద్రవ్య సంస్కరణ లక్ష్యాలను సాధిస్తూనే ఉంది. వరుసగా ఐదవ సంవత్సరం రాష్ట్రం 2010-11 లో కూడా రెవెన్యూ మిగులు నమోదు చేసింది. ద్రవ్యలోటు కూడా ఎఫ్.ఆర్.బి.ఎమ్. చట్టం నిర్దేశించిన పరిమితిలోనే ఉంది. ద్రవ్య బాధ్యతలు జి.ఎస్.డి.పి. లో 30.3 శాతం మించరాదని ఎఫ్.ఆర్.బి.ఎమ్. చట్టంలోనూ, 2014-15 నాటికి 25 శాతం లోపు ఉండాలని 13 ఆర్థిక సంఘం సూచించగా, రాష్ట్రం తన ద్రవ్య బాధ్యతలను ఈ సంవత్సరం చివరకు 24.52 శాతానికి తీసుకురాగలిగింది.

---

[17] పేజి 87 లోని పారిభాషిక పదకోశం చూడండి

[18] పేజి 87 లోని పారిభాషిక పదకోశం చూడండి

సొంతపన్నులు, పన్నులు కాని ఆదాయం ₹ 12,880 కోట్ల మేర పెరగటం వలన రెవెన్యూ రాబడి నిరుటి మీద ఈ సంవత్సరం (₹ 16,318 కోట్లు) 25 శాతం మేర గణనీయంగా పెరిగాయి. ఐతే, క్యాపిటల్ వ్యయం సుమారు 19 శాతం (₹ 2,670 కోట్లు) తగ్గింది. మొత్తం వ్యయంలో క్యాపిటల్ వ్యయం నిష్పత్తి కూడా బాగా తగ్గిపోయింది. సముచితమైన ఆర్థికాభివృద్ధికి గాను క్యాపిటల్ వ్యయం అధికం చేస్తామంటూ బడ్జెట్ ప్రసంగంలో ప్రభుత్వం ఇచ్చిన హామీతో దీనికి పొంతన లేదు. నీటిపారుదల, రోడ్లు రంగాల్లో పనులు, ప్రాజెక్టులు సకాలంలో పూర్తి చేయలేదు. ఫలితంగా వీటి నిర్మాణ వ్యయం పెరగడమే కాక, ఆశించిన ప్రయోజనాలు నెరవేరలేదు. నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి కావడానికి తగిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, వాటి అమలును ప్రభుత్వం నిశితంగా పర్యవేక్షించాలి.

రాష్ట్ర ప్రభుత్వం 2010-11 లో అభివృద్ధి వ్యయానికి తగిన ద్రవ్య ప్రాధాన్యత ఇచ్చినా గానీ విద్యా రంగంలో వ్యయం సాధారణ వర్గం రాష్ట్రాల సగటు వ్యయం కన్నా తక్కువగా ఉంది. ప్రభుత్వం ఈ విషయంలో తగు చర్యలు చేపట్టవలసి ఉంది.

ప్రస్తుతం ఋణ వసూళ్ల స్థాయి మరీ అధమంగా ఉంది (ఈ సంవత్సరం ఇచ్చిన ఋణాలలో 5.19 శాతం). వివిధ చట్టబద్ధ కార్పొరేషన్లు, కంపెనీలు, సహకార సంస్థలలో ప్రభుత్వ పెట్టుబడులపై గత ఐదేళ్లలో ప్రతిఫలం రేటు నామమాత్రంగా 0.47 శాతం ఉండగా ఇదే సమయంలో సగటు వడ్డీ రేటు 7.60 శాతం ఉంది. ఈ పెట్టుబడులు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు గుదిబండగా పరిణమించాయి.

పదమూడవ ఆర్థిక సంఘం సిఫార్సుల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అంత ప్రాధాన్యత లేని నష్టదాయక సంస్థలకు ముగింపు పలికేందుకు పథకం రూపొందించుకోవాలి.